# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
8-8-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 136

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## తమిళనాడులో ఆన్ లైన్‌లో మద్యం!

దుకాణాల వద్ద బారులు తీరాల్సిన పనిలేదు

ముందుగా బుక్ చేసుకుంటే నేరుగా మద్యం

విజయ్ సర్కార్ కీలక నిర్ణయం

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** తమిళనాడు మద్యం పాలసీలో విజయ్ సర్కార్ విప్లవత్మక అడుగులు వేసింది. మద్యం విక్రయాల వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు ప్రయత్నించింది. వినియోగదారులకు సౌలభ్యం కల్పించేందుకు డిజిటల్ బుకింగ్, ముందస్తు చెల్లింపుల కోసం ప్రత్యేక ఆన్లైన్ పోర్టల్, మొబైల్ యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చింది.



- మిగతా 2వ పేజీలో

## త్వరలో మద్యం ధరల పెంపు

ప్రభుత్వానికి ధరల నిర్ణయ కమిటీ నివేదిక

ఈ నెల 15 తర్వాత అమల్లోకి కొత్త ధరలు?

రాష్ట్రంలో మద్యం ధరలు త్వరలో పెరగనున్నాయి. బడ్జెట్, మిడ్-రేంజ్, ప్రీమియం కేటగిరీలను బట్టి బ్రాండ్ల వారీగా ధరలు పెంచేందుకు రంగం సిద్ధమైంది. సవరించిన ధరలతో కూడిన నివేదికను 'ధరల నిర్ణయ కమిటీ గురువారం ప్రభుత్వానికి సమర్పించింది. కమిటీ నివేదికను పరిశీలించిన అనంతరం సర్కారు తుది నిర్ణయం తీసుకోనుంది.

2లో



## నేటి నుంచి గిగ్ వర్కర్ల సమ్మె

నిలిచిపోనున్న డెలివరీ, క్యాబ్, ఆటో సేవలు

కనీస మొత్తాన్ని, చార్జీలను పెంచాలని,



## ఆపరేషన్ తెలంగాణ!

### గురిపెట్టిన బిజెపి హై కమాండ్



తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం. రాష్ట్ర బిజెపి నేతలంతా ఢిల్లీ క్యూ కట్టారు. పార్టీ ముఖ్య నాయకులు రాజధాని బాట పట్టారు. బిజెపి జాతీయ నాయకత్వంతో అత్యవసర భేటీ ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధ్యక్షతన కీలక సమావేశం జరగనుంది.

ఢిల్లీ బాట పట్టిన భారతీయ జనతా పార్టీ నేతలు

అత్యవసర భేటీ

దిశా నిర్దేశం చేయనున్న పెద్దలు

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఈ ప్రతిష్టాత్మక భేటీకి తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు అధ్యక్షత వహిస్తున్నారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల బృందం పూర్తిస్థాయిలో హాజరవుతోంది.

**గెలుపే లక్ష్యంగా..**

వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి అధికారంలోకి రావాలని బిజెపి భావిస్తోంది. ఈ తరుణంలో ఎలా అడుగులు వేయాలనే దానిపై కార్యాచరణ సిద్ధం చేసేందుకే ఈ సమావేశం అని తెలుస్తోంది. తెలంగాణలో అధికార పార్టీ అనుసరిస్తున్న విధానాలు, క్షేత్రస్థాయిలో ప్రజల స్పందన, సమస్యల సాధనలో ప్రతిపక్షంగా బిజెపి పోషిస్తున్న పాత్ర పై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించుకున్నారు. ముఖ్యంగా గ్రామీణ,

2లో

## తెలంగాణలో వరుణ యాగం!

శ్రీశైలం ఆవరణలో ప్రత్యేక పూజలు ..యాదగిరి పండితుల పర్యవేక్షణలు జపాలు



రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో యాగం

పూర్ణాహుతిలో పాల్గొననున్న రేవంత్

తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షం జాడలేదు. ఇటీవల వర్షాలు పడుతున్నా ఎందుకో రాష్ట్రంలో సంతృప్తికరంగా ఖరీఫ్ పనులు ముందుకు సాగడం లేదు. ఈ తరుణంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడాలని బలమైన సంకల్పంతో ఒక యాగం నిర్వహించాలని చూస్తోంది. అందులో భాగంగా నాగార్జునసాగర్ ప్రాంగణంలో భారీ వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** యాదగిరిగుట్ట లక్ష్మీ నృసింహస్వామి వేద పండితుల ఆధ్వర్యంలో ఈ యాగం జరగనుంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడాలని.. పంటలు సమృద్ధిగా పండాలని భారీ క్రతువు నిర్వహించేందుకు

- మిగతా 3వ పేజీలో

## తెలంగాణలో పొలిటికల్ లవ్ గేమ్!

తన ప్రేమను అడ్డుకుంటున్నారు అంటూ అధికార పార్టీ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కుమారుడు ఆవేదన

ఏకంగా మీడియా ముందుకు వచ్చి ఆరోపణలు

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో మరో పొలిటికల్ లవ్ గేమ్ వెలుగులోకి వచ్చింది.

2లో



## విజయవాడ మేయర్ అభ్యర్థిగా బోండా సిద్ధార్థ!

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు కుమారుడికి ఛాన్స్

చంద్రబాబు, లోకేష్ గ్రీన్ సిగ్నల్

## కోటీశ్వరులకు రైతుభరోసా ఎందుకు?

బైక్‌లపై కాలేజీకి వచ్చేవారికి ఉచిత ఫీజులెందుకు?

ఉచిత పథకాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి


వీటి వల్ల జనం పనికి వెళ్లడం మానేశారు

కూలీలు దొరకక రైతులు ఏడుస్తున్నారు

ఖజానాలో డబ్బు లేకపోతే అధికారి ఏం చేస్తారు?

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు చురకలు



కోటీశ్వరులకు రైతుభరోసా పేరుతో పెట్టుబడి సాయం అందించాల్సిన అవసరం ఏంటని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అలాగే లగ్జరీ బైక్‌లపై తిరిగే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాల్సిన అవసరమేంటని వ్యాఖ్యానించింది. ఉచిత పథకాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, వీటి వల్ల ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేసింది. స్టాంప్ డ్యూటీపై కంటోన్మెంట్ బోర్డు నుంచి వసూలు చేసిన సర్‌ఛార్జిని తిరిగి చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని

2లో

## పట్టభద్రుల ఎమ్మెల్సీగా 'సామ'

రామ్మోహన్ రెడ్డి వైపు కాంగ్రెస్ హై కమాండ్ మొగ్గు

యువజన కాంగ్రెస్, విద్యార్థి విభాగాల్లో మంచి పట్టు

బలమైన అభ్యర్థి అవుతారని భావిస్తున్న హస్తం పార్టీ



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఫోకస్ పెట్టింది. బలమైన అభ్యర్థులను రంగంలోకి దించాలని చూస్తోంది. ఒకవైపు భారత రాష్ట్ర సమితి, మరోవైపు భారతీయ జనతా పార్టీ సైతం గట్టి ప్రయత్నాల్లోనే ఉన్నాయి. అందుకే కాంగ్రెస్ ముందుగా జాగ్రత్త పడుతోంది. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత జరుగుతున్న మొదటి ప్రధాన నియోజకవర్గ ఎన్నిక కావడం.. పట్టభద్రులు పట్టు నిరూపించుకోవాల్సిన అవసరం ఉండడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. మరోవైపు అధికార కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సంఖ్య అధికంగా ఉంది. ప్రస్తుతం రేసులో టిపిసిసి మీడియా అండ్

3లో

# కోటీశ్వరులకు రైతుభరోసా ఎందుకు?

## తెలంగాణలో పొలిటికల్ లవ్ గేమ్!

(మొదటి పేజీ తరువాయి)

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కుమారుడి ప్రేమాయణం, విభేదిస్తున్న తండ్రి, ఒకరిపై ఒకరు సవాళ్లు పొలిటికల్ గా హాట్ గా మారాయి. పవర్ తో పాటు పొలిటికల్ ఇమేజ్ ఒకవైపు.. మనసు పడ్డ యువతి కోసం తండ్రిని ఎదిరించిన కుమారుడు ప్రేమాయణం మరోవైపు.. ఇలా తెలంగాణ రాజకీయాల్లో రక్తి కట్టిస్తోంది. తాను ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకునేందుకు సిద్ధపడిన కొడుకు సంతోష్ గౌడ్ సొంత తండ్రి పైన ఇప్పుడు బహిరంగంగా విమర్శలకు దిగడంతో ఇది మరింత ముదిరి పాకాన పడుతోంది. రాజకీయ రంగు పులుముకుంటోంది.

**ప్రేమ వివాహానికి అభ్యంతరం..**

ప్రకాష్ కుమార్ గౌడ్ కుమారుడు సంతోష్ గౌడ్ ప్రేమ వివాహం చేసుకునేందుకు సిద్ధపడ్డారు. అయితే వీరి వివాహానికి తండ్రి అంగీకరించలేదని తెలుస్తోంది. ఆస్తి వివాదాలు, అంతర్గత కక్షలను ముడిపెట్టి గుండాలతో తనపై దాడులకు తెగబడుతున్నారని సంతోష్ ఆరోపిస్తున్నారు. మరోవైపు మణికొండలోని ప్రియురాలు నివాసం పై దాడి జరిగిందని.. ప్రాణభయంతో డయల్ 100కి ఫోన్ చేసినా .. పోలీసులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విధిలేక మీడియా ముందుకు వచ్చినట్లు సంతోష్ గౌడ్ చెబుతున్నారు. ముందస్తు కుట్రతో తప్పుడు కేసుల్లో ఇరికించి జైలుకు పంపాలని చూస్తున్నారని కూడా చెప్పుకొచ్చారు. ఏకంగా తన ప్రియురాలితో కలిసి మీడియా ముందుకు రావడం విశేషం.

**ఎమ్మెల్యే ఘాటు స్పందన..**

మరోవైపు తన కుమారుడు సంచలన ఆరోపణలకు సంబంధించి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్పందించారు. వాడు ఎవడో నాకు తెలియదు. వాడితో నాకు ఎలాంటి సంబంధం లేదు అంటూ కొట్టి పారేశారు. సమయం వచ్చినప్పుడు మాట్లాడుతానంటూ చెప్పుకొచ్చారు. ఒకవైపు ప్రాణభయంతో రోడ్డు ఎక్కిన కుమారుడు.. మరోవైపు నాకు తెలియదు అంటూ సీన్లోకి రాకుండానే తండ్రి అయిన ఎమ్మెల్యే దీనిని దాటవేశారు. అయితే ఇది రాజకీయ రంగు పులుముకునే అవకాశం ఉంది. ఎందుకంటే వ్యక్తిగత వ్యవహార శైలి సైతం ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్లో కొత్త రాజకీయ రంగు పులుముకుంటూ వస్తోంది. అటువంటిది అధికార పార్టీ ఎమ్మెల్యే విషయంలో.. సొంత కుమారుడే ఆరోపణలు చేస్తుండడాన్ని ప్రత్యర్థులు పట్టించుకోరు అనుకుంటే పొరపడినట్టే. చూడాలి మరి ఏం జరుగుతుందో..

## తమిళనాడులో ఆన్ లైన్‌లో మద్యం!



ఇకపై మందుబాబులు గంటల తరబడి దుకాణాల వద్ద క్యూలైన్లలో నిలబడాల్సిన పనిలేదు. ముందస్తుగానే ఆన్లైన్ లో బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించింది.

**నేరుగా షాపు వద్దకు వెళ్తే..**

ఈ నూతన విధానం ద్వారా 21 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయసున్న పౌరులకు మాత్రమే ఈ సరికొత్త అవకాశాన్ని కల్పించింది విజయ్ సర్కార్. ఆన్లైన్ వేదికగా తమకు కావాల్సిన మద్యం బ్రాండ్లు, అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలు, ధరలను ప్రత్యక్షంగా తనిఖీ చేసుకోవచ్చు. డిజిటల్ విధానంలో చెల్లింపులు పూర్తి చేసిన తర్వాత సిస్టం ఒక క్యూఆర్ కోడ్ లేదా ఓటీపీని జనరేట్ చేస్తుంది. ఈ సేవ ద్వారా వినియోగదారులు సమీపంలోని టాస్మాక్ షాపుల నుంచి నేరుగా తమ ఆర్డర్ను రిజర్వ్ చేసుకునే అవకాశం ఉంటుంది. వినియోగదారులు ఆన్లైన్లో పేమెంట్ చేసేటప్పటికి.. హోమ్ డెలివరీ కి మాత్రం అవకాశం లేదు. బుకింగ్ పూర్తయిన తర్వాత వినియోగదారులు నేరుగా సంబంధిత దుకాణానికి వెళ్లి.. యువర్ కోడ్ ను చూపించి తమ మద్యం సీసాలను సేకరించుకోవాల్సి ఉంటుంది. అయితే ఎంఆర్పి కంటే అదనపు వసూలు లేకుండా చూడడమే ఈ ఆన్లైన్ విధానం ముఖ్య ఉద్దేశంగా తెలుస్తోంది. దుకాణాల వద్ద జరిగే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని కూడా ప్రభుత్వం భావిస్తోంది.

**బడ్జెట్ ప్రతిపాదనల్లో..**


తమిళనాడులో కొత్త బడ్జెట్ను ప్రవేశపెట్టింది విజయ్ సర్కార్. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మేరీ విల్సన్ ఇటీవల బడ్జెట్ను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వ టెండర్ల కేటాయింపుల్లో పారదర్శకతకు పెద్దపీట వేయనున్నట్లు తెలిపారు. ఆదాయాన్ని పెంచే చర్యల్లో భాగంగా మద్యం తయారీ యూనిట్లపై ప్రత్యేక పన్ను విధించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. దీని ద్వారా సుమారు 1000 కోట్ల రూపాయల అదనపు ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు మద్యం విక్రయాల్లో జరుగుతున్న అవకతవకలను నియంత్రించేందుకు గాను ఈ ఆన్లైన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండేందుకు ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని విజయ్ సర్కార్ నమ్ముతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

(మొదటి పేజీ తరువాయి)

కోరుతూ కంటోన్మెంట్ బోర్డు మెంబర్‌గా వ్యవహరించిన జె.రామకృష్ణ హైకోర్టులో పిటిషన దాఖలు చేశారు. ఈ పిటిషనపై ఇటీవల విచారణ చేపట్టిన హైకోర్టు సర్ఛార్జి తిరిగి చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు ఆదేశాలు అమలు కాకపోవడంతో పిటిషనర్ కోర్టు ధిక్కరణ పిటిషన దాఖలు చేశారు. ఈ కేసులో ప్రతివాదిగా ఉన్న ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు పలుమార్లు నోటీసు ఇచ్చినప్పటికీ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో పాటు ప్రత్యక్ష హాజరు నుంచి మినహాయింపు కోరకుండానే గైర్హాజరు కావడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

**ఇన్ని ఉచితాలైతే ఎలా?**

సందీప్ కుమార్ సుల్తానియాపై కొద్ది రోజుల క్రితం హైకోర్టు బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. వారంట్ అమలు చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. రూ.5 వేల విలువకు వ్యక్తిగత బాండ్ ఇస్తేనే బెయిల్ ఇవ్వాలని పేర్కొంది. కోర్టు హాజరవుతానన్న హామీతో పూచీకత్తు తీసుకుని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు బెయిల్ మంజూరు చేశారు. ఈ నేపథ్యంలోనే సుల్తానియా శుక్రవారం జస్టిస్ నగేశ భీమపాక ధర్మాసనం ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా సుల్తానియా వివరణ ఇస్తూ.. పిటిషనర్‌కు చెల్లించాల్సిన మొత్తంలో రూ.25.45 కోట్లు ఇచ్చేశామన్నారు. మిగతా మొత్తాన్ని వాయిదాల రూపంలో చెల్లిస్తామని చెప్పారు. ఈ చెల్లింపు వివరాలతో అఫిడవిట్ దాఖలు చేస్తామని కోర్టుకు నివేదించారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తూ ప్రభుత్వం చెల్లింపులు చేసిన నేపథ్యంలో సంతృప్తి



చెందిన ధర్మాసనం.. సందీప్‌కుమార్ సుల్తానియాకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ వద్ద నిధులు లేకపోవడానికి ఉచిత పథకాలే కారణమని జస్టిస్ నగేశ భీమపాక అభిప్రాయపడ్డారు. తాను ప్రభుత్వానికి లేదా మరెవ్వరికీ వ్యతిరేకంగా మాట్లాడటం లేదని చెప్పారు.

**నిధులు లేనప్పుడు ఎవరు మాత్రం ఏం చేస్తారు?**

"కూలీలు దొరకక గ్రామాల్లో రైతులు ఏడుస్తున్నారు. ఎవ్వరూ పనికి వెళ్లడం లేదు. ఖజానాలో నిధులు లేనప్పుడు ఎవరు మాత్రం ఏంచేస్తారు? ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి స్థానంలో ఎవరున్నా ఏమీ చేయలేరు. ఆయనపై వెయ్యి కోర్టు ధిక్కరణ కేసులు ఉన్నాయి. ఈ లెక్కన ఆయన జీవితాంతం జైల్లో ఉండాల్సి వస్తుంది. ప్రత్యక్ష హాజరుకు ఆదేశించడం బాధాకరమే.. కానీ, కోర్టు ఉత్తర్వుల అమలుకు తప్పదు" అని జడ్జి వ్యాఖ్యానించారు. "రాష్ట్రంలో 1.05 కోట్ల తెల్లరేషన కార్డులు ఉండటం ఏంటి? రాష్ట్ర జనాభా కన్నా ఎక్కువ మంది తెల్లరేషన కార్డుల్లో కుటుంబ సభ్యులుగా ఉన్నారు" అన్నారు. మరోవైపు పోలీస్‌స్టేషనలలో పనిచేసే స్వీపర్లు, అటెండర్లకు కనీస వేతనాలు చెల్లించాలని జస్టిస్ నగేశ భీమపాక ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. కనీస వేతనాలు అమలు చేయకుండా ఏకమొత్తంలో తక్కువ జీతాలు ఇస్తున్నారని పేర్కొంటూ వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేసే 49 మంది స్వీపర్లు హైకోర్టులో పిటిషన దాఖలు చేశారు. కనీస వేతనాలపై ప్రభుత్వం జారీ చేసిన తాజా నోటిఫికేషన్ల ప్రకారం పిటిషనర్లకు కనీస వేతనాలు చెల్లించాలని.. నాలుగు వారాల్లో అమలు చేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

## ఆపరేషన్ తెలంగాణ!



పట్టణ స్థాయిల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తక్షణమే చేపట్టవలసిన భవిష్యత్ కార్యాచరణ పై అధిష్టానం.. రాష్ట్ర నేతలతో సమాలోచనలు జరపనుంది. స్పష్టమైన రోడ్ మ్యాప్ ఖరారు చేయనుంది.

**అధికార పార్టీకి ప్రత్యామ్నాయంగా..:** తెలంగాణలో అధికార పార్టీకి ప్రత్యామ్నాయంగా ఎదగడమే ధ్యేయంగా బిజెపి జాతీయ నాయకత్వం తీవ్రంగా దృష్టి సారించింది. ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు, పోరాటాలు నిర్మించడానికి ఈ భేటీ వేదిక కానుంది. భవిష్యత్తులో రాబోయే సంస్థగత, స్థానిక ఎన్నికలకు పార్టీ క్యాడర్ ఇప్పటినుంచే ఎన్నికల మోడ్ లో ఉంచే వ్యూహంలో భాగంగానే ఈ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

**నేతల మధ్య విభేదాలకు చెక్..:** ఇటీవల బీజేపీ నేతల మధ్య అంతర్గత విభేదాలపై హైకమాండ్ దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. ఢిల్లీ నుంచి వచ్చిన పెద్దలు నేరుగా నేతల మధ్య విభేదాలు సమసి పోయేలా చర్చలు జరిపారు. ఇప్పుడు ఏకంగా ఈ అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర నాయకత్వం, ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయాన్ని మరింత పటిష్టం చేయడం కోసం ఈ సమావేశం అన్నట్టు ఉంది పరిస్థితి. పార్టీ నేతలంతా ఏకతాటిపై నడుస్తూ, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి అజెండాను సామాన్య ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని హై కమాండ్ ఈ భేటీ ద్వారా దిశ నిర్దేశం చేయనుంది.

## త్వరలో మద్యం ధరల పెంపు

అన్ని ప్రక్రియలు పూర్తి చేసి ఈ నెల 15 తర్వాత కొత్త ధరలను అమల్లోకి తెచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. రాష్ట్రంలో 2023లో మద్యం ధరలను సవరించారు. వాస్తవానికి రెండేళ్లకోసారి ధరలను సవరించాల్సి ఉంది. కానీ, మూడేళ్లుగా ధరలు పెంచకపోవడంతో తమకు ఇబ్బందికరంగా మారిందని మద్యం తయారీ సంస్థలు చెబుతున్నాయి. ముడిసరకుల ధరలు, రవాణా, పన్నులు, ఇతర నిర్వహణ ఖర్చులు పెరిగాయని, లాభాలు బాగా క్షీణించాయని డిస్టిలరీలు, మద్యం తయారీ సంస్థలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వం ధరల నిర్ణయ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ప్రతినిధులు.. తయారీదారులతో పలుమార్లు చర్చలు జరిపారు. పెరిగిన ఖర్చుల వివరాలను సేకరించి నివేదిక రూపొందించారు. ఐఎంఎఫ్ఎల్ సహా అన్ని రకాల మద్యం ఎమ్మార్పీల సవరణకు ఈ నివేదికే ప్రాతిపదిక కానుంది. అయితే.. మూడేళ్ల క్రితం తక్కువ ధర/బడ్జెట్ కేటగిరీలో అత్యధికంగా 15 శాతం వరకు అంటే బాటిల్‌పై రూ.90 వరకు ధర పెంచారు. సెమీ ప్రీమియం, ప్రీమియం బ్రాండ్లు 6–10 శాతం వరకు అంటే.. ఫుల్ బాటిల్‌పై రూ.100–120 వరకు పెంచారు. ఈ సారి కూడా 10–15 శాతం వరకూ పెంచాలని తయారీదారులు పట్టుబడుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. పొరుగు రాష్ట్రాల్లో తక్కువ ధర ఉండడాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటోంది. ఎట్టకేలకు త్రిసభ్య కమిటీ నివేదిక అందడంతో ధరల పెంపుపై అధికారికంగా జీవో రావడమే తరువాయి అని తెలుస్తోంది.



## విజయవాడ మేయర్ అభ్యర్థిగా బోండా సిద్ధార్థ!

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** బోండా ఉమామహేశ్వరరావుకు టిడిపి హై కమాండ్ కీలక హామీ ఇచ్చిందా? అందుకే ఆయన తిరిగి యాక్టివయ్యారా? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడుతున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో బోండా ఉమామహేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు తెలుగుదేశం పార్టీలో ప్రకంపనలు రేపాయి. ముద్రగడ పద్మనాభం విషయంలో తేలిగ్గా తీసుకోవడం వల్లే 2019లో టిడిపికి నష్టం జరిగింది అంటూ ఉమా వ్యాఖ్యలు చేశారు. పైగా వైసీపీ మాజీమంత్రి అంబటి రాంబాబుతో వేదిక పంచుకున్నారు. దీంతో టిడిపి హై కమాండ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. త్రీ మెన్ కమిటీ సభ్యుల ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. దీంతో తాను ఎటువంటి తప్పు చేయలేదు అని వివరణ ఇచ్చుకోవాల్సింది బోండా ఉమామహేశ్వరరావు.

**దక్కని మంత్రి పదవి..:** తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం కొనసాగుతూ వచ్చారు బోండా ఉమామహేశ్వరరావు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు టిడిపి తరఫున గెలిచారు. మంత్రి పదవి ఆశించారు. అయితే వివిధ సమీకరణలో భాగంగా ఆయనకు అవకాశం దక్కలేదు. మంత్రివర్గ విస్తరణలో సైతం ఆయనకు అవకాశం దక్కదు అని తేలిపోయింది. అందుకే బోండా ఉమామహేశ్వరరావు పార్టీ లైన్ దాటి మాట్లాడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఒకానొక దశలో బోండా ఉమామహేశ్వరరావు వైసీపీలో చేరిపోతారని కూడా ప్రచారం సాగింది. కానీ ఇటీవల చాలా యాక్టివ్ అయ్యారు ఉమామహేశ్వరరావు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డీఎస్సీ అక్రమాలపై ఆందోళనకు దిగగా.. దానిపై ఘాటుగా రియాక్ట్ అయ్యారు. అయితే ఇంతలోనే ఏంటి మార్పు అనే చర్చ నడుస్తోంది. కానీ ఇటీవల తన కుమారులతో కలిసి బోండా ఉమామహేశ్వరరావు సీఎం చంద్రబాబును కలిసినట్లు తెలుస్తోంది. చంద్రబాబుతో పాటు లోకేష్ నుంచి కీలక హామీ దక్కినట్లు ప్రచారం నడుస్తోంది.

**మేయర్ గా ప్రతిపాదన..:** విజయవాడ మేయర్ అభ్యర్థిగా బోండా ఉమామహేశ్వరరావు సిద్ధార్థ పేరును ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్లో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. పైగా మేయర్ గా ప్రత్యక్షంగా ఎన్నుకోవాల్సి ఉంటుంది. మంత్రి పదవిని ఆశిస్తున్న బోండా ఉమామహేశ్వరరావుకు మూడు పార్టీల పొత్తు ఉండడంతో కుదిరే పని కాదు. వివిధ రాజకీయ సమీకరణల్లో ఆయనకు ఛాన్స్ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అందుకే ఆయన కుమారుడు సిద్ధార్థ కు విజయవాడ మేయర్ పదవి ఇచ్చేందుకు చంద్రబాబు సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆ విషయం చెప్పిన తరువాత బోండా ఉమామహేశ్వరరావు కొంత ఉపశమనం పొందారని.. అందుకే పార్టీలో యాక్టివ్ అయినట్లు పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం ఉంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# తెలంగాణలో వరుణ యాగం!



సిద్ధపడుతుండడం విశేషం. అయితే గతానికి భిన్నంగా తెలంగాణలో యాగాలు నిర్వహిస్తుండడం నిజంగా శుభ పరిణామమే.

**గతంలో రాజకీయ యాగాలు..**

తెలంగాణలో యాగాలు అంటే రాజకీయ రంగు పులుముకోవడం సహజంగా మారింది. దాదాపు 10 ఏళ్లపాటు నవ తెలంగాణను పాలించిన కేసీఆర్ ఎన్నెన్నో యాగాలను నిర్వహించారు. ఏపీ నుంచి స్వరూపానందేంద్ర స్వామి లాంటి ప్రముఖుడిని తెచ్చి యాగాలు చేశారు. అని అవన్నీ తన రాజకీయాల కోసమేనని ఇట్టే అర్థం అవుతోంది. కానీ ప్రస్తుతం రేవంత్ మాత్రం ఈ రాష్ట్ర ప్రయోజనాల కోసం.. ఈ రాష్ట్ర ప్రజల సుభిక్షం కోసం యాగాలు నిర్వహిస్తుండడం నిజంగా శుభ పరిణామం. ఈ ఏడాది తెలంగాణకు వర్షాలు ముఖం చాటేసాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో తెలంగాణలో అధికార కాంగ్రెస్పై ఒత్తిడి పెరిగింది. ఎన్నో రకాల ఒత్తిళ్లు ప్రారంభం అయ్యాయి. ఇంతలో వర్షాలు ప్రారంభమై తెలంగాణలో ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. అయినా సరే దేవాదాయ శాఖ పరంగా భారీ వరుణ యాగం నిర్వహించేందుకు రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది.

**తీవ్ర వర్షాభావం**

సాధారణంగా రాష్ట్రానికి జూన్లోనే రుతుపవనాలు ప్రవేశిస్తాయి. కానీ ఈ ఏడాది ఎల్ ని నో ప్రభావంతో ఆశాజనకంగా వర్షాలు పడలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ ప్రమాదకరంలో పడింది. అయినా సరే రేవంత్ సర్కార్ ఉపశమన చర్యలు ప్రారంభించింది. అయితే ఇటీవల తెలంగాణలో వర్షాలు ప్రారంభం అయ్యాయి. ఖరీఫ్ పనులు కూడా మొదలయ్యాయి. కానీ ఇప్పటికే దేవాదాయ శాఖ పరంగా వరుణ యాగాలకు సిద్ధపడిన తెలంగాణ సర్కార్.. దానిని కొనసాగింపు ఇవ్వాలని చూసింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు సమీపంలో భారీ వరుణ యాగం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

# నేటి నుంచి గిగ్ వర్కర్ల సమ్మె

తెలంగాణలో గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లు శనివారం నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నారు. గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల నిబంధనలను తక్షణమే ప్రకటించాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో వారు ఈ సమ్మె చేపట్టనున్నారు. దీంతో అన్ని రకాల డెలివరీలు, ఉబర్, ర్యాపిడో, ఓలా రవాణా సేవలు నిలిచిపోనున్నాయి. ఈ నిరసనకు తెలంగాణ యాప్ ఆధారిత డ్రైవర్స్ ఫోరం, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియనతో పాటు పలు సంఘాలు మద్దతు ప్రకటించాయి. రాష్ట్రంలో 3.9 లక్షల మంది గిగ్, ప్లాట్‌ఫాం, యాప్ ఆధారిత క్యాబ్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, డెలివరీ వర్కర్లు ఉన్నారు. గత కొన్నేళ్లుగా వీరు తమ డిమాండ్లపై ఆందోళనలు నిర్వహిస్తున్నారు. యాప్ ఆధారిత రవాణా సేవలకు ప్రభుత్వం, ప్లాట్‌ఫాం కంపెనీలు కలిసి కనీస బేస్ ఫేర్‌ను, ప్రతి కిలోమీటర్‌కు న్యాయమైన ఛార్జీలు నోటిఫై చేయాలని, తమకు స్థిరమైన ఆదాయం లభించేలా చూడాలని, ప్రైవేట్ (నాన-కమర్షియల్) ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలను యాప్ ఆధారిత ప్రయాణికులు, సరుకు రవాణా సేవలకు ఉపయోగించడాన్ని కఠినంగా నిషేధించాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. ఆటో డ్రైవర్లకు ఏటా రూ. 12 వేలు ఇస్తామన్న హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. జూన 22వతేదీన రాష్ట్రవ్యాప్త బ్రేక్‌డౌన ఫ్లాష్ సమ్మె చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే ఆగస్టు 8 నుంచి నిరవధికంగా సేవలను నిలిపి వేస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా నిరవధిక సమ్మెకు దిగారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీగా 'సామ'

కమ్యూనికేషన్ చైర్మన్, సీనియర్ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డి ముందు వరసలో ఉన్నట్లు తెలుస్తోంది.

**పార్టీ తరపున వాయిస్..**

తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ ఎన్నెన్నో కష్టాలు పడింది. అటువంటి కష్టకాలంలో పార్టీ వాయిస్ ను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సామ రామ్మోహన్ కీలకపాత్ర పోషించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ విధానాలపై స్పష్టమైన ఆధారాలతో, పక్కా వాయిస్ తో ఎదురు దాడి చేయడంలో ఆయన చురుగ్గా వ్యవహరించారు. పైగా విద్యావంతుడిగా మంచి పేరు ఉంది. అందుకే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి ఆయనకు అవకాశం ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది.

**విద్యార్థి, యువతలో పట్టు..**

యువజన కాంగ్రెస్లో రామ్మోహన్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తూ వచ్చారు. ఎన్ఎస్యుఐ, యూత్ కాంగ్రెస్ కాలం నుంచి క్షేత్రస్థాయి విద్యార్థి, యువజన వర్గాల్లో మంచి నెట్వర్క్, క్రేజ్ ఆయనకు ఉంది. పట్టభద్రుల ఎన్నికల్లో విద్యావంతులైన యువత ఓట్లే కీలకం కాబట్టి... వారికి సుపరిచితమైన నాయకుడిని బరిలోకి దించితే ప్రయోజనం ఉంటుందని కాంగ్రెస్ హై కమాండ్ భావిస్తోంది. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి ఆశీస్సులు ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అయితే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులకు సంబంధించి క్షేత్రస్థాయిలో అంతర్గత సర్వేలు, చర్చలు పూర్తిచేసి అధికారికంగా నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

# సర్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష





**ఆగస్టు 10లోగా డిజిటలైజేషన్ పూర్తి**

**డ్రాఫ్ట్ ఓటరు జాబితా ఆగస్టు 17న విడుదల**

**జిల్లాలో 79 శాతం పూర్తయిన డిజిటలైజేషన్**

**కొత్తగా 16 పోలింగ్ కేంద్రాల ప్రతిపాదన**

**సర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం కోరిన అధికారులు**

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 07: భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు ూ×= ప్రక్రియను నిబంధనల ప్రకారం, పారదర్శకంగా పూర్తి చేస్తున్నట్లు అడిషనల్ కలెక్టర్ సంగీత తెలిపారు. శుక్రవారం సాయంత్రం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అడిషనల్ కలెక్టర్ సంగీత సర్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు భారత ఎన్నికల సంఘం గడువు పొడిగించడంతో ప్రక్రియను పూర్తి చేసేందుకు అదనపు సమయం లభించిందన్నారు. ఆగస్టు 10 వరకు ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ఆగస్టు 17న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ ప్రచురించనున్నట్లు తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై ఏవైనా క్లెయిమ్స్ లేదా అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు సమర్పించవచ్చని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఏఎస్‌డీ జాబితాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, రెండు రోజుల్లోగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం 1,200కు పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లకు సంబంధించి అవసరమైన చోట కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు కోసం రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ప్రస్తుతం 1,633 పోలింగ్ స్టేషన్లు ఉండగా, రేషనలైజేషన్ అనంతరం 1,649 పోలింగ్ స్టేషన్లను ప్రతిపాదించినట్లు తెలిపారు. అంటే కొత్తగా 16 పోలింగ్ స్టేషన్లను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ సగటున 79 శాతం పూర్తయిందని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. నియోజకవర్గాల వారీగా డిజిటలైజేషన్ పురోగతి: నారాయణఖేడ్ -- 88 శాతం, ఆందోల్ -- 87 శాతం, జహీరాబాద్ -- 82 శాతం, సంగారెడ్డి -- 80 శాతం, పటాన్‌చెరు -- 67 శాతం పూర్తయిందని వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా చురుకైన సహకారం అందించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పాండు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కళకు ఆదరణ పెంచాలి

**చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి: అడిషనల్ కలెక్టర్ పాండు**



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 07: చేనేత రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు చేనేత కార్మికుల కళానైపుణ్యానికి తగిన గుర్తింపు కల్పించి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ పాండు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన హ్యాండ్లూమ్ వాక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేనేత రంగం దేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. తరతరాలుగా చేనేత వృత్తిని కొనసాగిస్తూ అద్భుతమైన వస్త్రాలను తయారు చేస్తున్న కార్మికుల కృషిని గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి వినియోగించడం ద్వారా కార్మికులకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి ప్రభుత్వ సంక్షేమ, ప్రోత్సాహక పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ర్యాలీలో హ్యాండ్లూమ్ శాఖ సహాయ సంచాలకులు వెంకట్రావు, జిల్లా అధికారులు, సిబ్బంది, చేనేత కార్మికులు, యువత, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మరోసారి పరమత సహనాన్ని చాటుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**రూ.25 లక్షల సొంత నిధులతో చోటి మసీదు భవన నిర్మాణానికి అండ**



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 07:** పరమత సహనం, మత సామరస్యానికి ప్రతీకగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మరోసారి తన సేవా భావాన్ని చాటుకున్నారు. పటాన్‌చెరు డివిజన్ ఎంజీ రోడ్డులోని చోటి మసీదు ప్రార్థనా స్థలంలో రూ.25 లక్షల సొంత నిధులతో నిర్మించిన భవనాన్ని శుక్రవారం మత పెద్దల సమక్షంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎంఆర్ మాట్లాడుతూ.. నూతన భవనం మసీదు నిర్వహణకు, ఆర్థిక అవసరాల పరిష్కారానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రపంచంలోని అన్ని మతాలు శాంతి, ప్రేమ, మానవత్వాన్ని బోధిస్తాయని, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరి మనోభావాలను గౌరవించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో, పరస్పర గౌరవంతో జీవించే వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమన్నారు. ఇప్పటివరకు సొంత నిధులతో 200కు పైగా దేవాలయాలు, 100కు పైగా మసీదులు, 20కి పైగా చర్చిల నిర్మాణానికి సహకరించినట్లు తెలిపారు. ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మత పెద్దలు లియాకత్ అలీ, మొయిజుర్ రెహ్మాన్, ఇక్బాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

**దీక్షా శిబిరాలపై దాడులు సరికాదు**

**బొత్స సత్యనారాయణ మండిపాటు**

విజయవాడ: డీఎస్సీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ వైసీపీ చేపడుతున్న రిలే నిరాహార దీక్షా శిబిరాలపై దాడులు చేయించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విజయవాడలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నేతృత్వంలోని దీక్షా శిబిరంపై దాడి చేసి టెంట్లు ధ్వంసం చేయడం, కార్యకర్తలు, మహిళలపై రాళ్లు, కోడిగుడ్లతో దాడులు చేయడం రాజకీయ ఉన్మాదానికి పరాకాష్ఠ అని ఆయన వ్యాఖ్యానించారు. దీక్షా శిబిరం టెంట్‌పై మూత్ర విసర్జన చేయడం, మల్లాది విష్ణును వ్యాన్‌లో తరలిస్తుంటే జెండా కర్రతో దాడికి తెగబడటం రాష్ట్రంలో శాంతిభద్రతల క్షీణతకు అద్దం పడుతోందన్నారు. దాడులను అడ్డుకోవాల్సిన పోలీసులే బాధితులైన వైసీపీ నాయకులను అరెస్ట్ చేయడం విచారకరమని బొత్స విమర్శించారు. డీఎస్సీ నియామకాల అక్రమాలపై ప్రభుత్వం సీబీఐ విచారణ జరిపించాలని, ఈ దందాకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వం ఎంతగా అణచివేయాలని చూసినా ప్రజా సమస్యలపై తమ పోరాటం ఆగేది లేదని బొత్స స్పష్టం చేశారు.




## ఎడిటోరియల్




**గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఏ క్షణంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. అక్కడ అన్ని రాజకీయ పార్టీలు సన్నాహాలు మొదలుపెట్టాయి కూడా. ఈ విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ ముందు వరుసలో ఉంది. మరోవైపు భారత రాష్ట్ర సమితి సైతం గట్టిగానే ప్రయత్నాలు చేయనుంది. బిజెపి సైతం బలమైన అభ్యర్థులను రంగంలోకి దించాలని చూస్తోంది. సాధారణంగా గ్రేటర్ హైదరాబాద్ అంటే ఆంధ్ర సెటిలర్స్ ఎక్కువగా ఉంటారు.**

గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఏ క్షణంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. అక్కడ అన్ని రాజకీయ పార్టీలు సన్నాహాలు మొదలుపెట్టాయి కూడా. ఈ విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ ముందు వరుసలో ఉంది. మరోవైపు భారత రాష్ట్ర సమితి సైతం గట్టిగానే ప్రయత్నాలు చేయనుంది. బిజెపి సైతం బలమైన అభ్యర్థులను రంగంలోకి దించాలని చూస్తోంది. సాధారణంగా గ్రేటర్ హైదరాబాద్ అంటే ఆంధ్ర సెటిలర్స్ ఎక్కువగా ఉంటారు. అందుకే అందరి దృష్టి వారిపై ఉంది. మరోవైపు జనసేన సైతం అభ్యర్థులను బరిలో దించి కీలక స్థానాలను కైవసం

# తెలంగాణ టీడీపీకి కొత్త అధ్యక్షుడు

చేసుకోవాలని చూస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ పాత్ర ఎలా ఉండబోతుంది అనేది చర్చ. మొన్నటి సార్వత్రిక ఎన్నికలతో పాటు అంతకుముందు అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి పోటీ చేయలేదు. ఇప్పుడు గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటాలని ఆ పార్టీ ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ముందుగా తెలంగాణలో పార్టీ అధ్యక్ష పదవి భర్తీ చేసి.. బలోపేతంపై ఫుల్ ఫోకస్ పెట్టాలన్నది ఆలోచనగా తెలుస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికలతో పాటు సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయలేదు. మొన్నటి స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం బరిలో దిగలేదు. కానీ ఆ పార్టీ సానుభూతిపరులు కొన్నిచోట్ల పోటీ చేసి విజయం అందుకున్నారు. అయితే ఎందుకో తెలంగాణ టిడిపి విషయంలో చంద్రబాబు దూకుడుగా నిర్ణయాలు తీసుకోలేదు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి అక్కడ అన్ని రాజకీయ పార్టీలు టిడిపి వైపు ఆశగా ఎదురు చూసేవి. కానీ తెలంగాణ సెంటిమెంట్ పుణ్యమా అని టిడిపి విషయంలో జరిగిన విష ప్రచారం కూడా ఎక్కువ. టిడిపి పోటీ చేసిన ప్రతిసారి కెసిఆర్ చంద్రబాబును బూచిగా చూపి లాభపడ్డారు. దీనిని గ్రహించిన చంద్రబాబు 2023 ఎన్నికల్లో పూర్తిగా పోటీ చేయలేదు. అప్పుడు భారత రాష్ట్ర సమితి ఓడిపోయింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయకపోవడంతో.. మళ్లీ బీఆర్ఎస్ ఓడిపోయింది. అంటే చంద్రబాబు పై ఉన్న వ్యతిరేక ప్రచారాన్ని కెసిఆర్ అంతకు ముందు క్యాష్ చేసుకున్నారన్నమాట.తెలంగాణలో సెంటిమెంట్ అనేది పూర్తిగా కనుమరుగయ్యింది. ప్రస్తుతం అభివృద్ధి అజెండాను తెలంగాణ ప్రజలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అందుకే టిడిపి బలోపేతానికి ఇదే సరైన సమయం అని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ముందుగా తెలంగాణ టిడిపి అధ్యక్ష బాధ్యతలను భర్తీ చేయాలని చూస్తున్నట్లు సమాచారం. తెలంగాణలో పార్టీని యాక్టివ్ చేస్తే చాలా మంది నేతలు ఆ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే మాజీ మంత్రి బాబు మోహన్, మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి పార్టీలో పని చేసేందుకు ముందుకు వచ్చారు. మీరే కాదు పదుల సంఖ్యలో నాయకులు తిరిగి టిడిపిలోకి క్యూ కట్టే అవకాశం ఉంది. చాలామంది చంద్రబాబుకు స్వచ్ఛందంగా టచ్ లోకి వస్తున్నారని కూడా తెలుస్తోంది.తెలంగాణ టిడిపి బాధ్యతలు తీసుకునేందుకు చాలా మంది నేతలు ఇప్పుడు ముందుకు వస్తున్నారు. భారత రాష్ట్ర సమితి నాయకత్వాన్ని విభేదిస్తూ బయటకు వచ్చారు కవిత. ఆమె సైతం టిడిపిలో పనిచేసేందుకు అప్పట్లో ముందుకు వచ్చారని ప్రచారం సాగింది. అయితే నందమూరి కుటుంబం నుంచి మహిళా నేతగా ఉన్న హరికృష్ణ కుమార్తె సుహాసిని సైతం ప్రస్తుతం ఉపాధ్యక్షురాలుగా ఉన్నారు. మరోవైపు నందమూరి తారకరత్న భార్య అలేఖ్య రెడ్డి సైతం బాధ్యతలు అప్పగిస్తే తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. బిసి వర్గానికి చెందిన అరవింద్ కుమార్ గౌడ్ సైతం పార్టీ అధ్యక్ష బాధ్యతలు ఆశిస్తున్నారు. అయితే ముందుగా బలమైన నేతలను చేర్చుకొని తర్వాత అధ్యక్ష బాధ్యతలను అప్పగిస్తారని టిడిపిలో ఒక ప్రచారం ఉంది. మరి అందులో నిజం ఎంత ఉందో తెలియాలి.

**ప్రకృతి అనేది కేవలం మన చుట్టూ కనిపించే చెట్లు, అందమైన పూలు, పారే నదులు, గంభీరమైన పర్వతాల సముదాయం మాత్రమే కాదు. అది మానవాళికి అత్యంత ప్రాచీనమైన, గొప్ప గురువు. మనిషి ఈ భూమిపై పుట్టిన క్షణం నుంచి కన్నుమూసే వరకు, ప్రతి నిమిషం ప్రకృతి మనకు ఏదో ఒక అద్భుతమైన పాఠం నేర్పుతూనే ఉంటుంది. అందులో అత్యంత ఉత్కృష్టమైనది, నేటి సమాజానికి అత్యంత అవసరమైనది నిస్వార్థమైన ప్రేమ.నేటి ఆధునిక కాలంలో యాంత్రిక జీవితం, మితిమీరిన స్వార్థం, తీవ్రమైన పోటీతత్వం మనుషుల మధ్య ఆత్మీయ దూరాలను పెంచుతున్నాయి.**



# సృష్టి ధర్మం - సహజ ప్రేమ

ఇటువంటి క్లిష్ట సమయంలో మనం ఒక్కసారి ప్రకృతి వైపు తిరిగి చూస్తే, నిజమైన శ్రేయస్సుకు, షరతులు లేని ప్రేమకు అసలైన అర్థం ఏమిటో స్పష్టంగా బోధపడుతుంది.మనం నివసించే భూమిని తల్లి అని పిలవడం వెనుక ఎంతో గంభీరమైన అంతరార్థం ఉంది. ఒక తల్లి తన బిడ్డలకు ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా అన్నీ సమకూరుస్తుందో, భూమాత కూడా అలాగే మనకు అవసరమైన ఆహారం, తాగునీరు, ప్రాణవాయువు, నివాసం అన్నింటినీ ఉచితంగా అందిస్తుంది. మనం మన స్వార్థం కోసం ఆమెను ఎంతగా దోచుకున్నా, ఎంతగా కాలుష్యం చేసి గాయపరిచినా, ఆమె మళ్ళీ మళ్ళీ కోలుకుని మనకు జీవం పోస్తూనే ఉంటుంది. ఇది క్షమాగుణంతో కూడిన నిజమైన ప్రేమ కాదా? ప్రతిఫలం ఆశించని, ఎలాంటి నిబంధనలు లేని శాశ్వత ప్రేమను భూదేవి మనకు ప్రతిరోజూ తన ఆచరణ ద్వారా ప్రత్యక్షంగా చూపిస్తోంది.ఒక చెట్టును పరిశీలిస్తే, దానికి తన నుంచి ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనం లేకపోయినా మానవాళికి నీడనిస్తుంది, రుచికరమైన పండ్లను ఇస్తుంది, నిరంతరం ఆక్సిజన్ అందిస్తుంది. కొమ్మలను నరికివేసినా, కాయల కోసం రాళ్లు విసిరినా, అది తిరిగి మనకు తీపి పండ్లను, చల్లని నీడను మాత్రమే బహుమతిగా ఇస్తుంది. ఇది అపారమైన క్షమాగుణానికి, త్యాగానికి ఒక అద్భుతమైన ఉదాహరణ.మనం మనుషుల మధ్య సంబంధాలలో ఇలాంటి క్షమాగుణాన్ని, స్వార్థం లేని త్యాగాన్ని ఎప్పుడైనా చూపగలుగుతున్నామా అని ప్రతి ఒక్కరూ ఆత్మపరిశీలన చేసుకోవాలి. చెట్లు తమ వేర్ల వ్యవస్థ ద్వారా ఒకదానికొకటి పోషకాలను పంచుకుంటాయని ఇటీవలి శాస్త్రీయ పరిశోధనలు కూడా స్పష్టం చేశాయి. ఇది సమిష్టి జీవన స్ఫూర్తికి, పరస్పర సహకారానికి నిలువెత్తు నిదర్శనం.పక్షులు, జంతువుల ప్రేమకథలు మానవాళికి ఎన్నో నేర్పుతాయి. తల్లి పక్షి తన చిన్నారి పిల్లల కోసం ఎంత సుదూర ప్రాంతానికైనా ఎగిరి వెళ్ళి ఆహారాన్ని తీసుకువస్తుంది. తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి శత్రువుల నుంచి పిల్లలను రక్షించుకుంటుంది. ఏనుగుల మందలో ఏ ఒక్క జీవికి ఆపద వచ్చినా, మిగిలినవన్నీ కలిసికట్టుగా వచ్చి రక్షణగా నిలుస్తాయి. గాయపడిన తోటి జీవి శ్వాస తీసుకోవడానికి వీలుగా డాల్ఫిన్లు దానిని నీటి పైభాగానికి తీసుకువచ్చి సహాయం చేస్తాయి.ఈ జంతు ప్రపంచంలో కనిపించే పరస్పర సహకారం, త్యాగబుద్ధి నేటి మనిషి కంటే మిన్నగా కనిపిస్తాయి. మనం నాగరికులం అని గర్వపడుతున్నప్పటికీ, ప్రేమానురాగాలను పంచే విషయంలో ప్రకృతి జీవుల నుంచి నేర్చుకోవలసిన విషయాలు ఎంతో ఉన్నాయి.నదులు తమ జీవజలాన్ని ఏ ఒక్క నిర్దిష్ట ప్రాంతానికో లేదా వర్గానికో పరిమితం చేయవు. తాము ప్రవహించే ప్రతి గ్రామాన్ని, నగరాన్ని సస్యశ్యామలం చేస్తూ ముందుకు సాగుతాయి. ఎక్కడా ఆగకుండా, ఎవరిపట్లా వివక్ష చూపకుండా అందరికీ సమానంగా జీవాన్ని ప్రసాదిస్తాయి. ఇది సమానత్వంతో కూడిన ప్రేమకు ప్రతీక. మనుషుల మధ్య కులం, మతం, ప్రాంతం, ధనిక-పేద అనే వ్యత్యాసాలు లేకుండా ప్రేమను పంచగలిగితే, ఈ మానవ సమాజం ఎంత సుందరంగా మారుతుందో నదులు మనకు నిశ్శబ్దంగా బోధిస్తున్నాయి.ప్రకృతిలో వేసవి, వర్షం, శీతాకాలం వంటి రుతువులు క్రమం తప్పకుండా వస్తూ పోతూ ఉంటాయి. ప్రతి రుతువు తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి, తర్వాతి రుతువుకు మార్గం సుగమం చేస్తుంది. ఇది పరస్పర గౌరవానికి, సహనానికి, సమతుల్యతకు నిదర్శనం. మానవ సంబంధాలలో కూడా ఈ సూత్రం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంది. ఒకరి అభిప్రాయాలకు, అవసరాలకు తగిన స్థానం ఇవ్వడం, సహనంతో వ్యవహరించడం సంపూర్ణ ప్రేమకు మూలస్తంభాలు.నేటి ఆధునిక తరం సాంకేతిక పరిజ్ఞానంలో మునిగిపోయి, ప్రకృతితో ఉన్న సహజమైన అనుబంధాన్ని క్రమంగా కోల్పోతోంది. ఫలితంగా మనుషుల మధ్య ప్రేమ, సహనం, త్యాగం వంటి మానవీయ విలువలు తగ్గిపోతున్నాయి. మనం మళ్ళీ ప్రకృతి ఒడిలోకి చేరి, ఆమె నేర్పే పాఠాలను వింటే మన జీవితాలు మరింత సుసంపన్నం అవుతాయి. ప్రతిఫలం ఆశించని ప్రేమ, క్షమాగుణం, పంచుకునే మనస్తత్వం, సహనం వీటన్నింటినీ ప్రకృతి నిరంతరం బోధిస్తూనే ఉంది. మనం దానిని ఆచరిస్తే ఈ ప్రపంచం నిండైన ప్రేమమయంగా మారుతుంది.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# సరళా సాగర్ ప్రాజెక్టు...

**తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లా మదనాపూర్ మండలంలోని చిన్నవాగు (ఊకచెట్టు వాగు)పై ఉన్న సరళా సాగర్ ప్రాజెక్టు సాధారణ ఆనకట్టలకు భిన్నమైనది. గేట్లు ఎత్తాల్సిన అవసరం లేకుండా, విద్యుత్ సహాయం లేకుండా కేవలం గాలి--నీటి పరస్పర చర్యతో ఆటోమేటిక్‌గా పనిచేసే ఈ వ్యవస్థ ఇప్పటికీ ఇంజనీర్లను ఆశ్చర్యపరుస్తోంది. ఇది స్థానిక వనరులు, విదేశీ సాంకేతిక జ్ఞానం, భౌతిక శాస్త్ర సూత్రాల సమ్మేళనంగా నిలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లా మదనాపూర్ మండలంలోని చిన్నవాగు (ఊకచెట్టు వాగు)పై ఉన్న సరళా సాగర్ ప్రాజెక్టు సాధారణ ఆనకట్టలకు భిన్నమైనది.**



గేట్లు ఎత్తాల్సిన అవసరం లేకుండా, విద్యుత్ సహాయం లేకుండా కేవలం గాలి--నీటి పరస్పర చర్యతో ఆటోమేటిక్‌గా పనిచేసే ఈ వ్యవస్థ ఇప్పటికీ ఇంజనీర్లను ఆశ్చర్యపరుస్తోంది. ఇది స్థానిక వనరులు, విదేశీ సాంకేతిక జ్ఞానం, భౌతిక శాస్త్ర సూత్రాల సమ్మేళనంగా నిలుస్తుంది.1940 చివరలో వనపర్తి సంస్థానాధీశులు రాజా రామేశ్వరరావు ఈ ప్రాజెక్టును రూపొందించారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో సైఫన్ టెక్నాలజీని చూసిన తర్వాత, దానిని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అనుసరించారు. తల్లి సరళాదేవి పేరు మీద ఈ ఆనకట్టకు పేరు పెట్టారు. 1949లో పునాదులు వేయబడి 1959లో పూర్తయిన ఈ ప్రాజెక్టు స్వాతంత్ర్యానంతర కాలంలోనే సాగునీటి రంగంలో కొత్త మార్గం చూపింది. ఇది కేవలం నీటి నిల్వ కాకుండా, మానవ ప్రమేయం లేని ఆటోమేటిక్ వ్యవస్థగా రూపొందింది.సాధారణ ఆనకట్టల్లో గేట్లు తెరిచి మూయాల్సి వస్తుంది. కానీ ఇక్కడ క్యూ ఆకారంలోని గొట్టాలు (సైఫన్లు) అమర్చబడ్డాయి. ఇవి ఫిజిక్స్‌లోని వాక్యూమ్ సూత్రం మీద ఆధారపడి పనిచేస్తాయి. డ్యాంలో నీటి మట్టం నిర్ణీత స్థాయిని దాటగానే గొట్టాల్లోకి నీరు చేరుతుంది. మరింత పెరిగితే గాలి పూర్తిగా బయటకు వెళ్లి శూన్యత ఏర్పడుతుంది. ఆ ప్రెజర్ తేడా వల్ల నీరు వేగంగా కిందకు లాగబడి నదిలోకి ప్రవహిస్తుంది. నీటి మట్టం తగ్గగానే గాలి తిరిగి ప్రవేశించి ప్రవాహం ఆగిపోతుంది. ఇలా గేట్లు, మోటార్లు లేదా మానవ నియంత్రణ అవసరం లేకుండా పూర్తి స్వయంచాలకంగా నడుస్తుంది.ఆసియాలో ఇలాంటి సైఫన్ వ్యవస్థ ఉన్న ప్రాజెక్టుల్లో ఇది రెండోది. చిన్న సామర్థ్యం (సుమారు 0.5 టీఎంసీ) ఉన్నప్పటికీ, వేల ఎకరాల సాగుకు మద్దతు ఇస్తూ స్థిరమైన నీటి నిర్వహణకు ఉదాహరణగా నిలుస్తోంది. సుమారు 4,500 ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు స్థానిక రైతులకు జీవనాధారంగా మారింది. వర్షాధార ప్రాంతాల్లో నీటి లభ్యతను నిర్ధారించడం ద్వారా పంటల ఉత్పాదకతను పెంచింది. ఇలాంటి సహజ ఆధారిత పరిష్కారాలు నేటి కాలంలో మరింత అవసరం. వాతావరణ మార్పులు, విద్యుత్ కొరత, నిర్వహణ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో సరళా సాగర్ లాంటి మోడళ్లు స్ఫూర్తినిస్తాయి.ఈ వ్యవస్థ గురుత్వాకర్షణ, వాతావరణ పీడనం, శూన్యత వంటి ప్రాథమిక సూత్రాలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. నీరు పైనుంచి కిందకు ప్రవహించే సహజ ధోరణిని నియంత్రించడం ద్వారా వరద నీటిని సురక్షితంగా విడుదల చేస్తుంది. ఇది పర్యావరణపరంగా కూడా లాభదాయకం. విద్యుత్ వినియోగం లేకపోవడం, యంత్రాల నిర్వహణ ఖర్చు తగ్గడం, దీర్ఘకాలిక మన్నిక పెరగడం వంటి ప్రయోజనాలు ఉన్నాయి. ఆధునిక ఇంజనీర్లు ఈ సాంకేతికతను చూసి ఆశ్చర్యపోవడం సహజం, ఎందుకంటే ఇప్పటి అధునాతన సెన్సార్లు, కంప్యూటర్ నియంత్రణలు లేకుండానే దశాబ్దాలుగా నమ్మకంగా పనిచేస్తోంది.సరళా సాగర్ కేవలం ఒక ఆనకట్ట కాదు. ఇది మానవ ఆలోచన, ప్రకృతి శక్తుల సమన్వయానికి ప్రతీక. విదేశీ సాంకేతికతను స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చి, దీర్ఘకాలం నిలిచే వ్యవస్థను సృష్టించడం దీని గొప్పతనం. ఆధునిక ప్రాజెక్టులు సంక్లిష్ట యంత్రాలపై ఆధారపడుతున్నప్పుడు, ఇలాంటి సాధారణమైన కానీ సమర్థవంతమైన పరిష్కారాలను పునఃసమీక్షించాల్సిన అవసరం ఉంది.

# అమనగల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ అవగాహన వారోత్సవాలు



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ ఆధ్వర్యంలో 2026 ఆగస్టు 11 నుండి "ప్లాస్టిక్ అవగాహన వారోత్సవాలు" నిర్వహించనున్నట్లు క్లబ్ కార్యదర్శి లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, పి ఆర్ ఓ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్ప్రభావాలు, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే మార్గాలు, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్రపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వ్యర్థాలు వందల సంవత్సరాలు నేలలో కరగకుండా ఉండి భూసారాన్ని దెబ్బతీస్తాయని, వర్షపు నీటి కాలువలు మూసుకుపోయి వరదలకు కారణమవుతాయని, పశువులు, పక్షులు, జలచరాలు ప్లాస్టిక్‌ను ఆహారంగా భావించి మింగడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నాయని వివరించారు. ప్లాస్టిక్‌ను కాల్చడం వల్ల వెలువడే విషవాయువులు వాయు కాలుష్యాన్ని పెంచి శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు దారితీస్తాయని, ప్లాస్టిక్‌లోని సూక్ష్మ కణాలు (మైక్రోప్లాస్టిక్స్) ఆహారం, తాగునీటి ద్వారా మానవ శరీరంలోకి చేరి ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నాయని తెలిపారు. అదేవిధంగా ప్లాస్టిక్ కాలుష్యం వల్ల భూగర్భ జలాలు కలుషితమవడం, జీవవైవిధ్యం దెబ్బతినడం వంటి తీవ్రమైన పరిణామాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ సంచులు, స్టీల్ లేదా రాగి నీటి సీసాలు వినియోగించాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా రీసైక్లింగ్‌కు పంపించాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన కుటుంబ సభ్యులకు, పరిసర ప్రజలకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ బాధ్యతను పెంపొందించి, "ప్లాస్టిక్ రహిత సమాజం -- పరిశుభ్రమైన భవిష్యత్తు" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పి ఆర్ ఓ లయన్ పాషా పిలుపునిచ్చారు.



## మనిషికి యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి అద్భుతమైన సహజ ఔషధం

### ట్రస్మా జిల్లా అధ్యక్షులు, గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఒక అద్భుతమైన సహజ ఔషధం లాంటిదని ట్రస్మా జిల్లా అధ్యక్షులు, గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం నాంపల్లి మండల కేంద్రంలోని గాంధీజీ విద్యాలయంలో ఇంగ్లీష్ మీడియం విద్యార్థులతో కలిసి యోగ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా చేయడం వలన విద్యార్థులకు విజ్ఞానం పెంపొందిస్తుందని, గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. రక్తపోటును అదుపులో ఉంచుతుంది. క్రమం తప్పకుండా యోగా చేయడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరాన్ని దృఢంగా, సరళంగా మారుస్తుంది. బిపి, షుగర్ కడుపు నొప్పి వంటి సమస్యలను అదుపులో ఉంచుతూ, శ్వాసకోశ వ్యవస్థ మెరుగుపడుతుంది. శరీరంలో రోగాలతో పోరాడే శక్తిని పెంపొందిస్తుందని, యోగ ద్వారా సర్వరోగాలను నిరించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సరికొండ వెంకన్న, కర్నాటి నాగరాజు, ప్రిన్సిపల్ సామల వెంకటేశం, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు తాగడానికి నీరు లేదు...

### రోడ్లపై వృథాగా పోవడానికి మాత్రం ఉందా?

### నీరుడు శేఖర్ ముదిరాజ్ ఆగ్రహం





గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గం కిస్మత్‌పూర్ 122 డివిజన్ పరిధిలోని ఎర్రకుంట తండా పోచమ్మ ఆలయం సమీపంలో తాగునీటి పైప్‌లైన్ లీకై సుమారు 20 రోజులుగా వేలాది లీటర్ల తాగునీరు రోడ్లపై పారిపోతూ వృథా అవుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని కిస్మత్‌పూర్ మాజీ సర్పంచ్ నీరుడు శేఖర్ ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు నీరుడు శేఖర్ ముదిరాజ్ స్వయంగా ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఒకవైపు ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు విలువైన మంచినీరు రోడ్లపై వృథా అవుతుండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. ఈ విషయమై హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బి అధికారులకు పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ, ఒక్క అధికారి కూడా ఫోన్ ఎత్తకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ప్రజలకు తాగడానికి నీరు లేక ఇబ్బందులు పడుతుంటే, వేలాది లీటర్ల తాగునీరు రోడ్లపై వృథాగా పోతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదు? ప్రజల సమస్యలపై వారికి బాధ్యత లేదా అని నీరుడు శేఖర్ ముదిరాజ్ ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్ లీకేజీని శాశ్వతంగా మరమ్మతు చేయడంతో పాటు, ప్రమాదాలు జరగకుండా తక్షణమే హెచ్చరిక బోర్డులు, బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానిక ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యం



గండిపేట(క్రైమ్ మిర్రర్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి కనిపించకుండాపోయిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శివరాంపల్లి వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన షినిషరోన్(19) ఇంట్లో ఎవరికి చెప్పకుంబా బయటకు వెళ్లింది. ఎంతకి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేశారు. అయినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## తుర్కలశాపురంలో ఎస్బీఐ మినీ బ్యాంక్ ప్రారంభం..!

### గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు ఇక మరింత చేరువ

### ఎస్బీఐ ఆధ్వర్యంలో కస్టమర్ సర్వీస్ పాయింట్ ప్రారంభం



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో,ఆగస్టు 07 (క్రైమ్ మిర్రర్):** గుండాల మండలంలోని తుర్కలశాపురం గ్రామంలో భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కస్టమర్ సర్వీస్ పాయింట్ (మినీ బ్యాంక్)ను ఎస్బీఐ మేనేజర్ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ కునగళ్ళ లిల్లీ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ మినీ బ్యాంక్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుర్కలశాపురంతో పాటు సమీప గ్రామాల ప్రజలు నగదు లావాదేవీలు, ఖాతా సేవలు, ఈ-కేవైసీ, మహిళా సంఘాల రుణాల రీపేమెంట్లు, ప్రభుత్వ పథకాల నమోదు వంటి పలు సేవలను గ్రామంలోనే సులభంగా పొందవచ్చని పేర్కొన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన తదితర కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల సేవలు కూడా ఈ మినీ బ్యాంక్ ద్వారా అందుబాటులో ఉంటాయని తెలిపారు. గ్రామీణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బ్యాంకింగ్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పే పాయింట్ మేనేజర్ డి. రాజు యాదవ్, ఇమ్మడి దశరథ గుప్త, కునగళ్ళ మల్లేశం, ఆవుల సాయి ప్రసాద్, పొన్నగాని అంజయ్య, జోగు రమేష్, కునగళ్ళ గణేష్, వంగూరి మల్లేష్ యాదవ్, వంగూరి అనిల్ యాదవ్, ఉప్పుల వీరస్వామి యాదవ్, మరోజు మధు, ప్రేమ్ చంద్, మహేష్, ప్రవీణ్, పే పాయింట్ ప్రతినిధులు ప్రణయ్, కిరణ్, సతీష్, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గుండాలలో బీజేపీ బూత్ అధ్యక్షుల ఎంపిక



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగస్టు 07 (క్రైమ్ మిర్రర్ ):** భారతీయ జనతా పార్టీ గ్రామస్థాయి సంస్థాగత బలోపేతానికి గుండాల గ్రామంలో నూతన బూత్ అధ్యక్షులను ఎంపిక చేశారు. మండల బీజేపీ అధ్యక్షుడు పింగళి విజయభాస్కర్ రెడ్డి, మండల ఇన్‌చార్జి గుజ్జ సోమనర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ ఎంపిక జరిగింది.బూత్ నెం. 260కు అవిరెండ్ల సతీష్, బూత్ నెం. 261కు బంగారోజు సోమన్నలను బూత్ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన బూత్ అధ్యక్షులు పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు


## క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు కంటెంట్ రైటర్లు కావలెను

సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595


## ఎస్ఐఆర్ కార్యక్రమం చివరి దశలో బీఎల్‌వోలను కలిసిన బీజేపీ నాయకులు





గండిపేట(క్రైమ్ మిర్రర్): భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో, ఆగస్టు 10తో ముగియనున్న ఎస్ఐఆర్ కార్యక్రమం చివరి దశ సందర్భంగా శుక్రవారం ఉప్పర్‌పల్లిలోని బూత్ లెవల్ అధికారులను కలిసి కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. గత 35 రోజులుగా ఉప్పర్‌పల్లి పీఆర్ ప్యాలెస్ సమీపంలో ప్రత్యేక ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో దరఖాస్తు ఫారాలను నింపించడంతో పాటు అవసరమైన పత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. అలాగే ఇంటింటికీ వెళ్లి ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలను చైతన్యపరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సూపర్వైజర్ యాదయ్య, రవీందర్ రెడ్డి, విజయ్ యాదవ్, షేక్ బాషా, జయప్రకాశ్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, బీఎల్‌వోలు అనిల్, ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పసుపుల సందీప్ ముదిరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

# పగటి పూట తాళం వేసిన ఇండ్లే టార్గెట్..!

### అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్..3 లక్షల 25 వేల నగదు స్వాధీనం.

### నల్లగొండలో వరుస చోరీల మిస్టరీ ఛేదించిన పోలీసులు..మరో ఇద్దరి కోసం ప్రత్యేక గాలింపు



**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** నల్లగొండ పట్టణంలో ఇటీవల పగటి పూట వరుసగా చోటుచేసుకున్న, ఇళ్ల చోరీల కేసులను పోలీసులు ఛేదించారు. తాళం వేసి యజమానులు లేని ఇండ్లు, అపార్ట్మెంట్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన, ప్రధాన నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 3లక్షల 25 వేల నగదు, ఒక స్కూటీ, చోరీలకు ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం ప్రత్యేక బృందాలు రాష్ట్రాల మధ్య సమన్వయంతో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ వివరాలను అడిషనల్ ఎస్పీ జి. రమేష్ వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం, జూలై 26న నల్లగొండ పట్టణంలోని విటి. కాలనీలో ఉన్న అపార్ట్మెంట్లోని, ఓ ఫ్లాట్ తాళం పగులగొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటనపై, నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు వన్టౌన్, టూ టౌన్ పోలీసుల ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారాన్ని విశ్లేషిస్తూ నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టాయి. దర్యాప్తులో భాగంగా ఆగస్టు 6 సాయంత్రం పానగల్ బైపాస్ వద్ద, మరోసారి చోరీలకు పాల్పడేందుకు స్కూటీపై వస్తున్న ప్రధాన నిందితుడు మహమ్మద్ నసీమ్(48)ను, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీకి చెందిన అతడు హోటల్ వర్కర్గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. విచారణలో నల్లగొండ వన్టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీలతో పాటు, ఆంధ్రప్రదేశ్లోని నెల్లూరు జిల్లా వేదాయపాలెం, తిరుపతి జిల్లా తిరుచానూరు ప్రాంతాల్లో జరిగిన, పలు చోరీ కేసుల్లో కూడా తన ప్రమేయాన్ని అంగీకరించాడు.

**పగటి పూటే రెక్కీ... తర్వాత చోరీ**

విచారణలో దొంగల ముఠా అనుసరిస్తున్న విధానం పోలీసులను ఆశ్చర్యానికి గురిచేసింది. ముందుగా తాళం వేసి యజమానులు బయటకు వెళ్లిన, ఇళ్లను గుర్తించి కొంతసేపు రెక్కీ నిర్వహించేవారు. ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత పగటి సమయంలోనే, ఇనుప రాడ్లతో తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బంగారు ఆభరణాలు, నగదు దోచుకుని వెంటనే అక్కడి నుంచి పరారయ్యేవారు. జూలై 26న నల్లగొండలో ఈ ముఠా ముగ్గురు సభ్యులు కలిసి, రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుస చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. వన్టౌన్ పరిధిలోని రెండు ఇళ్లలో సుమారు ఐదు తులాల బంగారం, 30 వేల నగదు, టూటౌన్ పరిధిలోని విటి. కాలనీ అపార్ట్మెంట్లో మూడు తులాల బంగారు ఆభరణాలు, నగదు అపహరించినట్లు దర్యాప్తులో తేలింది. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్లోని నెల్లూరు జిల్లా వేదాయపాలెంలో 24 తులాల బంగారం, మూడు కిలోల వెండి ఆభరణాలు, తిరుచానూరులో తొమ్మిది తులాల బంగారం, 15 తులాల వెండి ఆభరణాలు చోరీ చేసిన కేసుల్లో కూడా, ఇదే ముఠా ప్రమేయం ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

**పాత నేరస్థుడే ప్రధాన నిందితుడు**

ప్రధాన నిందితుడు మహమ్మద్ నసీమ్ గతంలో ఢిల్లీ, ఇండోర్, మీరట్ ప్రాంతాల్లో అనేక చోరీ కేసుల్లో అరెస్టై జైలు శిక్ష అనుభవించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం హైదరాబాద్కు వచ్చి రాయదుర్గం, ఉప్పల్, మల్కాజిగిరి ప్రాంతాల్లో కూడా, వరుస చోరీలకు పాల్పడి మళ్లీ జైలుకు వెళ్లాడు. రెండు సంవత్సరాల శిక్ష అనంతరం విడుదలై మూడు నెలల క్రితం, అత్తాపూర్లో అద్దెకు ఉంటూ తిరిగి చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడి వద్ద నుంచి 3 లక్షల 25 వేల నగదు, ఢిల్లీ రిజిస్ట్రేషన్ స్కూటీ, రెండు ఇనుప రాడ్లు, ఒక మాస్క్, సెల్ఫోన్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ఇర్షాద్, షరీఫ్ల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయని, త్వరలోనే వారిని కూడా అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి ప్రధాన నిందితుడిని అరెస్టు చేసిన నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి పర్యవేక్షణలో, పనిచేసిన వన్టౌన్ సీఐ ఎ. రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ కె. ఆది రెడ్డి, ఎస్ఐలు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించారు.

## మైలార్దేవ్పల్లి పోలీస్స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యం



గండిపేట(క్రైమ్ మిర్రర్): మైలార్దేవ్పల్లి పోలీస్స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మైలార్దేవ్పల్లి మోహన్రెడ్డినగర్ ప్రాంతానికి చెందిన సమీర్ అలీ(48) జూలై 31వ తేదీ ఇంట్లో భార్యకు పని నిమిత్తం బయటకు వెళు _న్నానని చెప్పి తన బెలనో కారు టిఎస్11ఈఎం9420ను తీసుకోని వెళ్లాడు. అనంతరం ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన భార్య తన ఫోన్కు కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చింది. ఆందోళనకు గురై కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలలో, బంధువులు, స్నేహితుల వద్ద ఆచూకీ కోసం వెతికారు. ప్రయోజనం లేకపోవడం మైలార్దేవ్పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వ్యక్తి గురించి ఎలాంటి సమాచారం తెలిసిన మైలార్దేవ్పల్లి పోలీస్స్టేషన్ ఫోన్ నెంబర్లు 8712680419, 8712566979లలో సంప్రదించాలని కోరారు.

## శ్రీ కేదార్నాథ్ ఆలయ నిర్మాణానికి రూ.1 లక్ష విరాళం అందజేసిన అన్నపురెడ్డి మాధవ్ రెడ్డి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కిస్మత్పూర్ 122వ డివిజన్ పరిధిలో శుక్రవారం ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కేదార్నాథ్ క్షేత్రాధిపతి శ్రీ శివ రుద్ర సాధు స్వామీజీ కిస్మత్పూర్ ఆలయాన్ని సందర్శించి, జగద్గిరిగుట్టలో ఈ నెలలో జరగనున్న శ్రీ కేదార్నాథ్ ఆలయ మహా ప్రారంభోత్సవానికి సంబంధించి ఆలయ కమిటీ సభ్యులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు అన్నపురెడ్డి మాధవ్ రెడ్డి, జగద్గిరిగుట్టలో నిర్మాణం పూర్తయిన శ్రీ కేదార్నాథ్ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు తనవంతు సహాయంగా రూ.1 లక్ష విలువైన చెక్కును శ్రీ శివ రుద్ర సాధు స్వామీజీకి విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణం, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరించడం ప్రతి భక్తుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిస్మత్పూర్ మాజీ ఉపసర్పంచ్ నీరుడు శేఖర్ ముదిరాజ్, దళితరత్న అవార్డు గ్రహీత అంతయ్య, బండారు మల్లేష్, బీజేపీ నాయకులు వీరుడు పవన్ సాయి ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకుడు ఎక్కిరాల సంతోష్ గౌడ్, బీజేపీ నాయకుడు వెంకటేష్, టీవీటీల్ ఏ. నర్సింగరావు, ఎస్. స్వామి, యోగా శిక్షకులు విజ్జు వెంకటేష్, చంద్రశేఖర్, ఉదయ్ గౌడ్తో పాటు గ్రామ పెద్దలు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బిజెపి నూతన అధ్యక్షుడిగా గిరి వర్ధన్ రెడ్డి నియామకం

### మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ నర్వ పవన్




**కూకట్ పల్లి, ఆగస్టు 07 (క్రైమ్ మిర్రర్) :** మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ?బిజేపీ నూతన అధ్యక్షులుగా నియమితులైన గిరి వర్ధన్ రెడ్డి ని జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ నర్వ పవన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిని నర్వ పవన్ కుమార్ శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డి నేతృత్వంలో బిజెపి జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ విధానాలను, ప్రజా సమస్యలపై పోరాటాలను డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బిజెపి ఐటీ సెల్ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాధవరం కాంతారావు, బాచుపల్లి మాజీ కార్పొరేటర్ సుబ్బారావు, కూకట్పల్లి ఓబీసీ కన్వీనర్ వినోద్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జిల్లా అధ్యక్షుడికి అభినందనలు తెలియజేశారు.

## బోనాల వేళ దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు శూన్యం

### పిచ్చిమొక్కలు, గోతులమయంగా మారిన రోడ్లతో భక్తుల ఇబ్బందులు

### కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బోనాల ఉత్సవాలు సమీపిస్తున్న ఇప్పటి వరకు దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు జరగలేదని కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ కాటేదాన్, మైలార్దేవ్పల్లి డివిజన్ పరిధిలలో వివిధ బస్తీలలోని దేవాలయాల చుట్టూ పిచ్చి మొక్కలు, రోడ్డుపై గుంతలు పడి నీటితో నిండిన రహదారి ఉందన్నారు. తలపై బోనాలు ఎత్తుకుని మహిళలు, పాదాచారులు వెళ్లలేని పరిస్థితితో ఇబ్బందికరంగా మారిందన్నారు. ఎలాంటి గుంతలు పిచ్చి మొక్కలు లేకుండా అదే విధంగా ఎన్నో సార్లు స్ట్రీట్ లైట్లు వెలగడం లేదని మరమ్మత్తులు చేయాలని సంబంధిత అధికారులను మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదన్నారు. వీధుల్లో స్ట్రీట్ లైట్లు రిపేర్ చేయించి అవసరం ఉన్న ప్రాంతాల్లో కొత్త వాటిని మంజూరు చేసి బిగించాలన్నారు. అభివద్ధి పనుల పేరుతో పలు బస్తీలలో రోడ్డును తవ్వడంతో నోరు తెరచుకున్న మ్యాన్హోల్స్ ప్రమాదకరంగా మారాయన్నారు. తవ్విన రహదారి వెంబడి మహిళలు బోనాలు ఎత్తుకొని వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. కాటేదాన్, మైలార్దేవ్పల్లి డివిజన్ల పరిధిలోని పలు దేవాలయాల వద్ద కొత్తగా వీధిదీపాలు ఏర్పాటు చేసి పరిసరాల పరిశుభ్రత పనులు చేయించాలన్నారు. దశాబ్ధాల క్రితం జనాభాకు తగ్గట్లుగా వేసిన సివరేజ్ లైన్ కాస్తా చిన్నదిగా మారడంతో మురికినీరు రోడ్డుపై ఏరులైపారుతుందన్నారు. శివరేజ్ పైపులు పెద్దవి వేసి తర్వాత రోడ్డును వేయాలని కోరారు. దీనిని జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రాములు, బంగారయ్య, అశోక్, శశి, వెంకటరమణ, భాస్కర్, సురేష్, మోహన్, సింహాచలం, మహేందర్, నిఖిల్, చింటూ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేపీహెచ్బీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధ మహిళ అదృశ్యం



**కూకట్ పల్లి, అగస్ట్ 07 (క్రైమ్ మిర్రర్) :** ఓ వృద్ధ మహిళ అదృష్టమైన సంఘటన సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని కేపీహెచ్బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, లింగంపల్లి బుచ్చక్క (70) గత 20 రోజులుగా తన మేనల్లుడు ఇంట్లో ఉంటున్నారు. కొంతకాలంగా ఆమె మానసిక ఆరోగ్యం సరిగా లేకపోవడంతో కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో ఉంచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఆగస్టు 6న మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో కుటుంబ సభ్యులు తమ పనుల్లో నిమగ్నమై ఉండగా, బుచ్చక్క ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయారు. అనంతరం కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాలు, బంధువుల ఇళ్లు, ఆమెకు తెలిసిన ఇతర ప్రాంతాల్లో విస్తృతంగా గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. రాత్రంతా, తదుపరి రోజు ఉదయం వరకు కూడా ఎలాంటి సమాచారం దొరకకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. అదృశ్యమైన మహిళ ఎత్తు సుమారు 5 అడుగుల 1 అంగుళం, చర్మవర్ణం ముదురు, తెలుగు మాట్లాడతారు. చివరిసారిగా నీలం రంగు చీర ధరించి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లింగంపల్లి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మహిళ అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## అన్యాయం జరిగిన కార్మికులకు అండగా నిలుస్తా

### బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 07 (క్రైమ్ మిర్రర్) :** కుత్బుల్లాపూర్ లోని జెఆర్ ఇన్ఫ్రా ఆర్ఎంసి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ లో ఓనర్ జనార్ధన్ రావు, దగ్గర గత కొన్ని నెలల నుంచి కార్మికుడు మహేష్ కుమార్ సింగ్ పనిచేసేవారు. కార్మికుడు మహేష్ కుమార్ ఓనర్ జనార్ధన్ రావు అక్టోబర్ నెల వేతనం ఇవ్వాల్సి ఉండగా అవి ఇవ్వకపోవడంతో, కార్మికుల హక్కులను కాపాడేందుకు నిరంతర పోరాటం చేపడుతున్నాడని తోటి కార్మికుల ద్వారా తెలుసుకొని బి ఆర్ టి యు కార్మిక నాయకుడు రవి కార్యాలయం వద్దకు వెళ్లి మహేష్ కుమార్ సింగ్ కి జరిగిన అన్యాయం వివరించారు. వెంటనే స్పందించిన రవి హుటాహుటిన ఓనర్ జనార్దన్ రావు తో మాట్లాడి మహేష్ కు రావలసిన అక్టోబర్ నెల వేతనం కార్మికుడు మహేష్ కుమార్ కు చెక్ రూపంలో ఆ వేతనం ఇవ్వడం జరిగింది. కార్మికుడు మహేష్ మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్, గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎంజీఐటీలో అంతర్జాతీయ సదస్సు ఐసిడిఐఎస్ఎఫ్-2026 ఘనంగా ప్రారంభం

## సుస్థిర భవిష్యత్తు కోసం విఘాతాత్మక ఆవిష్కరణలపై దేశ విదేశాల నిపుణుల మేధోమథనం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** గండిపేటలో మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) సుస్థిర భవిష్యత్తు కోసం విఘాతాత్మక ఆవిష్కరణలు పేరుతో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఆగస్టు 7, 8 తేదీల్లో జరుగుతున్న ఈ సదస్సు పరిశోధకులు, విద్యావేత్తలు, పారిశ్రామిక నిపుణులు, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విజ్ఞాన మార్పిడి వేదికగా నిలిచింది. సదస్సు ప్రారంభోత్సవానికి పద్మశ్రీ డా. కె. బాలసుబ్రహ్మణ్యం (డైరెక్టర్, ఎన్ ఎఫ్‌టిడిసి–హైదరాబాద్) ముఖ్య అతిథిగా, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ డా. ఎ. రాజు గౌరవ అతిథిగా హాజరయ్యారు. కెనడాలోని టొరొంటో విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రవి రవీంద్రన్ అధ్యక్షోపన్యాసం చేశారు. ఎంజీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. చంద్రమోహన్ రెడ్డి, ఉప ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సుధాకర్ రెడ్డి, డైరెక్టర్ (ఆర్, డి) ప్రొఫెసర్ ఎన్. ఈశ్వర ప్రసాద్, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ డైరెక్టర్ ప్రొఫెసర్ టి.వి. రాజనీకాంత్‌తో పాటు దేశ విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఉప ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సుధాకర్ రెడ్డి స్వాగతోపన్యాసం చేస్తూ ఎంజీఐటీ విద్యా ప్రమాణాలు, పరిశోధనలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం ప్రొఫెసర్ టి.వి. రాజనీకాంత్ సదస్సు లక్ష్యాలు, ప్రధాన అంశాలు, సాంకేతిక సెషన్ల వివరాలను తెలియజేస్తూ, దేశ విదేశాల నుంచి పెద్ద ఎత్తున పరిశోధనా పత్రాలు అందాయని వెల్లడించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ పరిశోధన, అభివృద్ధి





కార్యక్రమాలకు ఎంజీఐటీ విశేష ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థులు ప్రముఖ శాస్త్రవేత్తల అనుభవాలను సద్వినియోగం చేసుకుని సృజనాత్మక ఆలోచనలను పెంపొందిం చుకోవాలని సూచించారు. ఇటువంటి అంతర్జాతీయ సదస్సులు విజ్ఞానాన్ని పంచుకునేందుకు, ఉమ్మడి పరిశోధనలకు బలమైన వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. అధ్యక్షోపన్యాసంలో ప్రొఫెసర్ రవి రవీంద్రన్ మాట్లాడుతూ ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని, ప్రతి పరిశోధనలో సుస్థిరత, పర్యావరణ పరిరక్షణ, వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డా. ఎ. రాజు మాట్లాడుతూ భారత సాంకేతికాభివృద్ధికి నిరంతర పరిశోధనలు, వినూత్న ఆవిష్కరణలు అవసరమని చెప్పారు. వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలని, డీఆర్‌డీవో పరిశోధనలకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని వివరించారు. ముఖ్య అతిథి పద్మశ్రీ డా. కె. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భవిష్యత్ సాంకేతిక అవసరాలను ముందుగానే గుర్తించి పరిశోధనలు సాగించాలని సూచించారు. విజ్ఞానాన్ని సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానంగా మలచడంలో విద్యాసంస్థలు, పరిశ్రమలు పరస్పరం సహకరించాలని పిలుపునిచ్చారు. మలేషియాకు చెందిన సెంటర్ ఫర్ ఇన్నోవేటివ్ కన్స్ట్రక్షన్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ యు. జాన్సన్ అలెంగారం గ్రాడ్యుయేట్ ఇంజనీర్ వర్సెస్ ప్రొఫెషనల్ ఇంజనీర్, సుస్థిర అభివృద్ధికి అధునాతన సాంకేతికతల సమన్వయం అంశాలపై ప్రత్యేక ఉపన్యాసాలు చేసి పరిశోధకులకు విలువైన సూచనలు అందించారు. చివరగా సదస్సు ఛైర్మన్ ప్రొఫెసర్ ఎన్. ఈశ్వర ప్రసాద్ వందన సమర్పణ చేస్తూ అతిథులు, వక్తలు, ప్రతినిధులు, నిర్వాహకులు, అధ్యాపకులు, ప్రాయోజకులకు కృతజ్ఞతలు తెలిపారు. సదస్సు రెండో రోజు వివిధ సాంకేతిక సెషన్లు, ముఖ్యోపన్యాసాలు, పరిశోధనా పత్రాల ప్రదర్శనలు జరగనున్నాయి. దేశ విదేశాలకు చెందిన పరిశోధకులు తమ తాజా ఆవిష్కరణలను పంచుకుంటూ సుస్థిర భవిష్యత్తు దిశగా కొత్త ఆలోచనలకు ఈ సదస్సు వేదిక కానుంది.

# కేపీహెచ్‌బీలో సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమం

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులకు కీలక సూచనలు

### సెక్స్‌టార్షన్ నుంచి డిజిటల్ అరెస్ట్ స్కామ్‌ల వరకు జాగ్రత్తలు వివరించిన పోలీసులు

**కూకట్‌పల్లి, ఆగస్టు 07 (క్రైమ్ మిర్రర్) :** ప్రస్తుతం రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజల్లో అప్రమత్తత పెంపొందించేందుకు కేపీహెచ్‌బీ పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అనేక సాఫ్ట్‌వేర్ సంస్థలు, శిక్షణా కేంద్రాలు కార్యకలాపాలు నిర్వహిస్తున్న కేపీహెచ్‌బీలోని మంజీరా ట్రినిటీ కమర్షియల్ కాంప్లెక్స్‌లో శుక్రవారం సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, డీఐ, సైబర్ వారియర్ బృందం పాల్గొని ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ సంస్థల ప్రతినిధులు, ప్రజలకు సైబర్ నేరాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రస్తుతం ఎక్కువగా జరుగుతున్న సెక్స్‌టార్షన్ మోసాలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, పెట్టుబడుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, ఫిషింగ్ లింకులు, యూపీఐ, బ్యాంకింగ్ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాలు వంటి అంశాలపై విపులంగా వివరించారు. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను ఎలా లక్ష్యంగా



చేసుకుంటారు, నకిలీ కాల్స్, సందేశాలు, లింకులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఎలా మోసగిస్తారనే విషయాలను ఉదాహరణలతో వివరించారు. అలాగే వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, యూపీఐ పిన్ వంటి గోప్యమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడం, అలాగే జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా వెంటనే ఫిర్యాదు నమోదు చేయడం వల్ల మోసపోయిన డబ్బును తిరిగి పొందే అవకాశాలు పెరుగు తాయని అధికారులు వివరించారు.

కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా గతంలో సైబర్ మోసాలకు గురైన కొందరు బాధితులు స్వచ్ఛందంగా తమ అనుభవాలను పంచుకున్నారు. సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి ఎలా మోసపోయామో, ఆ సమయంలో ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. వారి నిజ జీవిత అనుభవాలు అక్కడున్న వారిని తీవ్రంగా ఆలోచింపజేయడంతో పాటు డిజిటల్ లావాదేవీలు, సోషల్ మీడియా వినియోగంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తు చేశాయి. చివరిగా నిర్వహించిన ప్రశ్నలు--సమాధానాల (ఇంటరాక్టివ్) సెషన్లో పాల్గొన్నవారి సందేహాలకు పోలీసులు సమాధానాలు ఇచ్చారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు కేపీహెచ్‌బీ పోలీసులు చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పాల్గొన్న ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు అభిప్రాయపడి పోలీసు శాఖ చొరవను అభినందించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ డిజిటల్ సేవలను వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, సందేశాలు, లింకులు లేదా ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అప్రమత్తతే సైబర్ నేరాల నుంచి రక్షణకు ఉత్తమ మార్గమని కేపీహెచ్‌బీ పోలీసులు సూచించారు.




## జవహర్ నగర్ బ్రిడ్జి వద్ద కుంగిన రోడ్డును పరిశీలించిన మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

**బాలానగర్, ఆగస్టు 07 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ పరిధిలోని శోభనా కాలనీ--జవహర్ నగర్ కాలనీలను కలిపే బ్రిడ్జి ప్రారంభ భాగంలో రోడ్డు కుంగిపోవడంతో స్థానికులు మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన సతీష్ గౌడ్ మున్సిపల్ అధికారులను అప్రమత్తం చేసి, ప్రమాదాలు జరగకుండా కుంగిన ప్రాంతంలో వెంటనే బారికేడ్లు ఏర్పాటు చేయించారు. శుక్రవారం ఉదయం ఎంఎంసీ ఫతేనగర్ ఏఈ వరుణ్ దేవ్‌తో కలిసి కుంగిన ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన, తాత్కాలికంగా వెట్ మిక్స్ వేసి రోడ్డు మరింత కుంగిపోకుండా చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే బ్రిడ్జి నిర్మాణాన్ని సాంకేతికంగా పరిశీలించి, అవసరమైతే కొత్త కల్వర్టు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేస్తామని వెల్లడించారు. ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని, సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ హామీ ఇచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కంచి భిక్షపతి, జవహర్ నగర్ అధ్యక్షుడు కుక్కల రాము, ముదిరాజ్ శేఖర్, గట్ల సురేందర్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రక్షకుడే భక్షకుడయ్యాడా?.. ఇన్‌స్పెక్టర్‌పై కేసు

### న్యాయం చేస్తానని నమ్మించి లైంగిక దాడి చేశాడంటూ మహిళ ఫిర్యాదు

### బలవంతపు గర్భస్రావం, బెదిరింపులు, దాడి, నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు



పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 07: అమీన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జయలక్ష్మి నగర్‌కు చెందిన ఓ మహిళ ఫిర్యాదు మేరకు ఓ పోలీసు ఇన్‌స్పెక్టర్‌పై అత్యాచారం, బలవంతపు గర్భస్రావం, బెదిరింపులు, దాడి, నగదు వసూలు వంటి ఆరోపణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆగస్టు 6న రాత్రి సుమారు 8 గంటల సమయంలో మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో కుటుంబ తగాదా విషయంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ తనకు న్యాయం చేస్తానని నమ్మబలికి, తన సమ్మతి లేకుండా లైంగికంగా వేధించాడని ఫిర్యాదులో పేర్కొంది. దీని ఫలితంగా తాను గర్భం దాల్చగా, అనంతరం బలవంతంగా గర్భస్రావం చేయించాడని మహిళ ఆరోపించింది. తరచూ తనను పిలిచి రావాలని బెదిరించేవాడని, ఎదిరిస్తే దాడి చేసి గాయపరిచాడని, తన వద్ద నుంచి నగదు కూడా తీసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. మహిళ ఫిర్యాదు ఆధారంగా భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 64, 68, 74, 75, 77, 78, 89, 115, 308, 351తో పాటు సమాచార సాంకేతిక చట్టంలోని సెక్షన్లు 66, 67 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసుపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, దర్యాప్తులో లభించే సాక్ష్యాధారాల ఆధారంగా చట్టపరమైన తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. మహిళ చేసిన ఆరోపణలు దర్యాప్తులో ఉన్నాయని పోలీసులు తెలిపారు.



# వికలాంగుడి కన్నీటికి బీర్ల ఫౌండేషన్ అండ.. ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ

### వెల్మజాలకు చెందిన సింగారం రమేష్‌కు కాంగ్రెస్ నేత ఈరసరపు యాదగిరి గౌడ్ భరోసా

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగస్టు 07(క్రైమ్ మిర్రర్ ):** గుండాల మండలం వెల్మజాల గ్రామానికి చెందిన వికలాంగుడు సింగారం రమేష్ సొంత ఇంటి కోసం ఎన్నో రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో, చివరకు అతని బాధకు బీర్ల ఫౌండేషన్ అండగా నిలిచింది. ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి గౌడ్ శుక్రవారం గుండాల తహసీల్దార్ కార్యాలయం వద్ద రమేష్‌ను కలిసి అతని సమస్యలను తెలుసుకున్నారు. ఇల్లు కోసం గ్రామ సర్పంచ్‌తో పాటు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌కు కూడా దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు న్యాయం జరగలేదని రమేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. దీనికి వెంటనే స్పందించిన యాదగిరి గౌడ్, బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెల్మజాల గ్రామంలో సింగారం రమేష్‌కు త్వరలోనే ఇంటి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. వికలాంగులు, నిరుపేదల పక్షాన బీర్ల ఫౌండేషన్ ఎల్లప్పుడూ నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇమ్మడి దశరథ గుప్తా, గుండాల గ్రామ సర్పంచ్ దేవనబోయిన ఐలయ్య, ఉపసర్పంచ్ ఆవుల సాయి ప్రసాద్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొడిచేటి వెంకన్న, ఏలూరు రామ్ రెడ్డి, దూదిగాని నాగరాజు, కొడపర్తి భాస్కర్, ఆవుల శ్రీను, అనపర్తి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ ఫోన్ దొంగ అరెస్ట్...

### రూ.80 వేల విలువైన ఐఫోన్-16 ప్లస్ స్వాధీనం



**కూకట్ పల్లి, ఆగస్ట్ 07 (క్రైమ్ మిర్రర్) :** కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మొబైల్ ఫోన్ చోరీ కేసును పోలీసులు త్వరితగతిన ఛేదించారు. ఈ కేసులో అలవాటైన మొబైల్ ఫోన్ దొంగను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి సుమారు రూ.80 వేల విలువైన ఆపిల్ ఐఫోన్–16 ప్లస్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, విశ్వసనీయ సమాచారం మేరకు లులు మాల్ పరిసర ప్రాంతంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, అతడు చోరీ చేసినట్లు అంగీకరించాడు. అనంతరం చట్టపరమైన పంచనామా నిర్వహించి చోరీకి గురైన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన నిందితుడు అండే వెంకట రమణ (40). ఇతడు కూలీగా పనిచేస్తూ ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి ప్రాంగణం సమీపంలోని ఫుట్‌పాత్‌పై నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో కూడా మొబైల్ ఫోన్ చోరీ కేసుల్లో అరెస్టయిన అలవాటైన నేరస్థుడిగా పోలీసుల విచారణలో వెల్లడైంది. కేపీహెచ్‌బీ పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. షాపింగ్ మాల్స్, మార్కెట్లు, బస్ స్టాండ్లు, మెట్రో స్టేషన్లు, జాతరలు వంటి రద్దీ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, పర్సులు వంటి విలువైన వస్తువులను జిప్ ఉన్న బ్యాగ్ లేదా సురక్షితమైన జేబులో ఉంచుకోవాలని, అపరిచితుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు.

**సూచనలు:** మొబైల్ పోయిన వెంటనే చేయాల్సినవి సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసి ఐఎంఈఐ నంబర్‌ను బ్లాక్ చేయించాలి. సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా డయల్–112కు వెంటనే ఫిర్యాదు చేయాలి. డెబిట్, క్రెడిట్ కార్డులు, యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, డిజిటల్ వాలెట్ సేవలను వెంటనే నిలిపివేయాలి. ఈ–మెయిల్, బ్యాంకింగ్, సోషల్ మీడియా తదితర ఖాతాల పాస్‌వర్డులను మార్చుకోవాలి. సంబంధిత మొబైల్ సేవా సంస్థకు సమాచారం ఇచ్చి సిమ్ కార్డును బ్లాక్ చేయించాలి. ప్రతి మొబైల్ ఫోన్ పోయిన లేదా చోరీకి గురైన ఘటనను తప్పనిసరిగా పోలీసులకు, అలాగే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలని కేపీహెచ్‌బీ పోలీసులు ప్రజలను కోరారు. సమయానికి ఫిర్యాదు చేస్తే మొబైల్‌ను గుర్తించే అవకాశాలు పెరగడంతో పాటు సైబర్ మోసాల

## ఖమ్మంలో ఎస్.కె ట్రేడ్ బటర్ఫ్లై ఫైర్ ఎగ్జిబిషన్ ప్రారంభం



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** స్థానిక ఖమ్మం నందు ఎస్ కె ట్రేడింగ్ ఫైర్ బటర్ఫ్లై ఎగ్జిబిషన్ను స్థానిక ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నందు ఖమ్మం ఆర్గనైజర్ గరికపెల్లి జానకిరామయ్య విలేకరుల సమావేశంలో తెలియజేసినారు ఈరోజు అనగా 7 ఆగస్టు శుక్రవారం 2026 నుండి 30-8-2026 వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని దానికి సంబంధించిన పర్మిషన్లు కార్పొరేషన్ నుంచి వచ్చాయని ఈ సందర్భంగా వారు తెలియజేసినారు ఈ ఎక్సిబిషన్ కు ఖమ్మం పట్టణంలో ప్రజలు చిన్నారులు అందరూ వచ్చి తిలకించి ఆనందంగా గడిపి వెళ్ళ వచ్చునని వారు తెలియజేసినారును కూడా నివారించవచ్చని పోలీసులు తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారులకు అందని ద్రాక్షలా కేకే కమిటీ

**కాలయాపన మాత్రమే.. కమిటీపై తెలంగాణ అమరవీరుల ఆశాల సాధన సమితి ఆగ్రహం.**

**రాష్ట్ర కోశాధికారి మల్లోజుల శ్రీనివాసాచారి**



**హైదరాబాద్(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఏళ్ల పాటు, ఉద్యమించిన ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన, కేకే కమిటీ ప్రస్తుతం కాలయాపన కమిటీగా మారిందని, తెలంగాణ అమరవీరుల ఆశాల సాధన సమితి రాష్ట్ర కోశాధికారి మల్లోజు శ్రీనివాస చారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమం అనేది కేవలం ఒక రాజకీయ ప్రక్రియ కాదని, అది లక్షలాది మంది ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమని ఆయన అన్నారు. రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు తమ జీవితాలను పణంగా పెట్టి పోరాడారని గుర్తు చేశారు. అలాంటి ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి వారికి సముచిత గౌరవం, గుర్తింపు, న్యాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కానీ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కేకే కమిటీ ద్వారా ఆశించిన ఫలితాలు రావడం లేదని, ఏర్పాటు చేసి సంవత్సరాలు గడుస్తున్నా స్పష్టమైన నిర్ణయాలు లేకపోవడం, ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించకుండా సమావేశాలు, చర్చల పేరుతో కాలయాపన చేయడం బాధాకరమని మల్లోజు శ్రీనివాస చారి పేర్కొన్నారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులకు, కేకే కమిటీ అందని ద్రాక్షలా మారిందన్నారు. ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్న వారికి నిరాశే మిగులుతోందని, కమిటీ ఏర్పాటు చేసి సంవత్సరాలు గడుస్తున్నా స్పష్టమైన నిర్ణయాలు లేకపోవడం, ఉద్యమకారుల మనోభావాలను దెబ్బతీస్తోంది" అని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నవారిని గుర్తించడం, వారి సేవలను నమోదు చేయడం, వారికి తగిన గౌరవం కల్పించడం వంటి అంశాలపై, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల కుటుంబాలు కూడా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాయని, వారి పరిస్థితులను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరారు. కేవలం కమిటీలు వేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావని, వాటికి కాలపరిమితితో కూడిన కార్యాచరణ అవసరమని మల్లోజు శ్రీనివాస చారి అన్నారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తెలంగాణ సాధనలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.తెలంగాణ అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొంటూ, వారి గౌరవం కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలంగాణ అమరవీరుల ఆశాల సాధన సమితి రాష్ట్ర కోశాధికారి మల్లోజు శ్రీనివాస చారి స్పష్టం చేశారు.



## ఘనంగా బొమ్ము వెంకటేశ్వర రెడ్డి జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలియజేసిన ప్రగతి నగర్ నాయకులు**

**నిజాంపేట్, ఆగస్ట్ 07 (క్రైమ్ మిర్రర్):** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతి రెడ్డి) జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి నగర్ నాయకులు బోట్ల తిరుపతి, శరత్ రెడ్డి, వడ్లకొండ సందీప్ తదితరులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బొమ్ము వెంకటేశ్వర రెడ్డి ప్రజా సేవలో మరింత ముందుకు సాగుతూ, ప్రాంత అభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తాతి రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## పండగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు...




**రాయదుర్గం క్రైమ్ మిర్రర్ :**పండుగ సాయన్న జయంతి సందర్భంగా శుక్రవారం రోజు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గల రాయదుర్గం లో కాంటెస్టేడ్ ఎమ్మెల్యే నక్కల ప్రవీణ్ ముదిరాజ్, వార్డ్ మెంబెర్ గొర్రెంక సతీష్ ముదిరాజ్ ల ఆధ్వర్యంలో పండగ సాయన్న ముదిరాజ్ చిత్ర పటానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సాయుధ పోరాటపటిమను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాకేష్ ముదిరాజ్, ఆనంద్ ముదిరాజ్, శరత్ ముదిరాజ్, రామక్రిష్ణ ముదిరాజ్, విక్కీ ముదిరాజ్, నితేష్ ముదిరాజ్, రాజేందర్ ముదిరాజ్, ప్రదీప్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి శాకాంబరీ అలంకరణ



**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్:** ఆశాడ మాస బోనాలమహోత్సవం సందర్బంగా శుక్రవారం రోజు చందానగర్, వేముకుంట గౌతమి నగర్ లోని శ్రీ శ్రీ శ్రీ మహాశక్తి లలితా పోచమ్మ దేవాలయం అమ్మవారికి షాకాంబరి అలంకారం చేశారు. వివిధరకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించి భక్తులచే పూజలు నిర్వహించారు. మహిళలచే లలితా సహస్రనామ పారాయణశీ చేసినట్లు ఆలయ ట్రస్టీ, మాజీ కౌన్సిలర్ జి. రవీందర్ రావు తెలిపాడు. ఆదివారం రోజు జరుపబడే బోనాల ఉత్సవాలకు దేవాలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేయడశీ జరిగిశీదనీ, భక్తులు ,శ్రేయోభిలాషులు, పుర ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.





# ఆగస్టు 10న జరిగే జైల్ భరోను జయప్రదం చేయండి

**డివైఎఫ్ఐ జిల్లా ఇన్చార్జ్ బండి రమేష్ పిలుపు.**

**యువతి యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలి**

**డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు**




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, యువజన వ్యతిరేక విధానాలకు నిరసనగా సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ)జిల్లా ఇన్చార్జ్ కామ్రేడ్ బండి రమేష్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం జిల్లా ఉపాధ్యక్షులు రావులపాటి నాగరాజు అధ్యక్షతన జరిగిన భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్ఐ) ఫ్రాక్షన్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బండి రమేష్ గారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కారంపై పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఖాళీగా ఉన్న లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతోందన్నారుప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటీకరణను ప్రోత్సహించడం వల్ల ఉద్యోగ అవకాశాలు క్షీణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను బలహీనపరిచే విధానాలు, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పట్ల కేంద్ర ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా చేపడుతున్న జైల్ భరో కార్యక్రమానికి డివైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు. దేశంలోని కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలు పరస్పర సంబంధం కలిగినవేనని, వాటి పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలే మార్గమని పేర్కొన్నారు. ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి యువతి, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు డివైఎఫ్ఐ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు నిర్వహిస్తున్న జైల్ భరో కార్యక్రమంలో యువత, విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేయాలని కోరారు. ప్రతి మండలం, పట్టణం నుంచి భారీగా యువతను సమీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం శ్రేణులకు సూచించారు.సమావేశానికి కూచిపూడి నరేష్, భూక్య ప్రసాద్, వంగూరి సుందర్రావు, భూక్య వనిజ, తుడుం నాగరాజు, తదితర ఫ్రాక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## శాంతి భద్రత పరిరక్షణపై నిఘా పెంచాలి...!

**రౌడీ షీటర్ల పై,సీసీటీవీ కవరేజ్ పై నిరంతరం దృష్టి పెట్టాలి --- డిసిపి నారాయణరెడ్డి**

**నెలవారి క్రైమ్ రివ్యూ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులు**



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం డీసీపీ కార్యాలయంలో మహేశ్వరం జోన్ డీసీపీ కె.నారాయణ రెడ్డి, ఐపీఎస్ అధ్యక్షతన, క్రైమ్ నియంత్రణ చర్యలు,శాంతి భద్రతల పరిరక్షణ, విజిబుల్ పోలీసింగ్ అమలుపై సమీక్షించేందుకు శుక్రవారం నెలవారీ క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించారు.సమావేశంలో డీసీపీ పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను సమగ్రంగా సమీక్షించారు. ముఖ్యంగా గ్రేవ్ అన్‌డిటెక్టెడ్ (UI) కేసులు, ఎస్సీ/ఎస్టీ కేసులు, పీడీ యాక్ట్ కేసులు, పోక్సో కేసులు,ఎన్‌డీపీఎస్ కేసులు, చార్జ్ షీట్లు, రౌడీ షీటర్లు, సీసీటీవీ కవరేజ్, కాల్ డీటైల్ రికార్డ్ (సి డి ఆర్) విశ్లేషణ, సైబర్ క్రైమ్ కేసులు మరియు ఇతర దర్యాప్తు కేసులపై ప్రత్యేక దృష్టి సారించారు.డీసీపీ పరిధిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు త్వరిత దర్యాప్తు,సమయానికి చార్జ్ షీట్లు దాఖలు చేయడం, హ్యాబిట్యువల్ నేరస్తులపై సమర్థవంతమైన పర్యవేక్షణ, సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థల బలోపేతం, ముందస్తు విజిబుల్ పోలీసింగ్ అమలు, అలాగే శాంతి భద్రతల కఠిన అమలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మహేశ్వరం ఏసీపీ శ్రీ ఎస్. జానకి రెడ్డి మరియు మహేశ్వరం జోన్‌కు చెందిన పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్ ఎచ్ ఓ) లు పాల్గొన్నారు.



## మాంటిస్సోరి హై స్కూల్లో తెలంగాణ బోనాల ఉత్సవం ఘనంగా వేడుకలు

**పాఠశాల డైరెక్టర్ డి రాజేందర్ గౌడ్**

**వనపర్తి ఆగస్టు 7 క్రైమ్ మిర్రర్:** పెబ్బేరు మున్సిపాలిటీ లో మాంటిస్సోరి హై స్కూల్ లో తెలంగాణ బోనాల పండుగ సందర్భంగా శుక్రవారం ముందస్తు బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ డి.రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ పాఠశాలలో బాలికలు బోనం కుండలకు అలంకరించి సాంప్రదాయంగా పూజించారు. బాలికలు సాంప్రదాయా దుస్తులతో, బాలురు పోతురాజుల వేషధారణలతో ఆట, పాటలతో అలరించడం జరిగింది. విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలని విద్యార్థులు ఎంతో ఆసక్తితో ముందస్తు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు.తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యే భవిష్యత్తుకు బాట.. లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలు: ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, ఆగస్టు 7: మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్ విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేసి వారి విద్యాభ్యాసానికి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది విద్యేనని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణ, అంకితభావంతో చదువుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంతో పాటు ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ డి. ధర్మా నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

**ప్రజా పాలనలో రాజకీయాలకు తావులేదు**

**ఆగస్టు 15 నుంచి కొత్త ఆసరా పింఛన్లు**

**తిరుమలాయపాలెంలో రూ. 7.00 కోట్ల పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన**




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తిరుమలాయపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తిప్పారెడ్డిగూడెం నుంచి రాకాసితండా వరకు రూ. 2.10 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు, రాజారాం నుంచి తుమ్మగూడెం వరకు రూ. 4.50 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే హైదర్ సాయిపేట, పాతర్లపాడు గ్రామాల్లో రూ. 20 లక్షల చొప్పున అంచనా వ్యయంతో నిర్మించనున్న పంచాయతీ భవనాలకు భూమిపూజ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రభుత్వం సమపాళ్లలో పరుగులు తీయిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చేందుకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. తిప్పారెడ్డిగూడెం అభివృద్ధికి ఇప్పటివరకు రూ. 35.55 కోట్లు, హైదర్ సాయిపేటకు రూ. 37 కోట్లు, పాతర్లపాడుకు రూ. 29.25 కోట్లు, రాజారాం గ్రామానికి రూ. 8.48 కోట్లు మంజూరు చేసి వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. రైతాంగానికి మద్దతు ధరతో పాటు వరికి క్వింటాలుకు రూ. 500 బోనస్, ఎకరాకు రూ. 6 వేల రైతు భరోసా జమ చేశామని గుర్తుచేశారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎవరికీ ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదని, పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. ప్రతి సోమవారం క్షేత్రస్థాయి ప్రగతి ఆధారంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే బిల్లులు జమ చేస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే రెండో విడత ప్రొసీడింగ్స్ అందజేస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి నూతన ఆసరా పింఛన్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రకటించారు.

# మండల అధికారులపై సర్పంచ్ ల ఆగ్రహం

**ప్రజా సమస్యలపై ప్రశ్నల అస్త్రం-- సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్**

**యూరియా నుంచి మిషన్ భగీరథ..మహిళా సంఘాల నుంచి అంగన్వాడీ వరకు అధికారులపై అసంతృప్తి.**




**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** మర్రిగూడ మండల సమీక్ష సమావేశం ఈసారి సాధారణ అధికారిక కార్యక్రమంగా కాకుండా, గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలపై, ప్రజా ప్రతినిధులు అధికారులను నేరుగా ప్రశ్నించిన వేదికగా నిలిచింది. గ్రామాల్లో అభివృద్ధి పనులు ఆశించిన వేగంతో సాగకపోవడం, ప్రభుత్వ పథకాల అమలులో కనిపిస్తున్న జాప్యం, క్షేత్రస్థాయిలో అధికారుల స్పందన లోపం వంటి, అంశాలపై సర్పంచులు ఒక్కొక్కరుగా తమ అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రత్యేకంగా యరగండ్లపల్లి సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్.. లేవనెత్తిన అంశాలు మండల వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను కేవలం ఫిర్యాదులుగా కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలకు సంబంధించిన అత్యవసర, అంశంగా ప్రస్తావిస్తూ ఆయన అధికారులను ప్రశ్నించారు. మిషన్ భగీరథ ద్వారా సరిపడా నీటి సరఫరా జరగకపోతే, గ్రామస్థులు ప్రజాప్రతినిధులనే నిలదీస్తున్నారని, అలాంటి పరిస్థితుల్లో సంబంధిత అధికారులు కూడా సమాన బాధ్యతతో వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. రైతుల సమస్యల విషయంలోనూ సమావేశం వేడెక్కింది. యూరియా నిల్వలు, పంపిణీ విధానం, రైతులకు ముందస్తు సమాచారం అందకపోవడం వల్ల, సాగు పనులు దెబ్బతింటున్నాయని సర్పంచులు పేర్కొన్నారు. రైతు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, గ్రామస్థాయిలోనే స్పష్టమైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేయాలని వారు సూచించారు. మహిళా సాధికారత అంశాన్ని కూడా సర్పంచ్ సంతోష్ యాదవ్ ప్రాధాన్యంగా ప్రస్తావించారు. గ్రామ సంఘ బంధం అధ్యక్షురాలి పదవిలో సంవత్సరాల తరబడి ఒకే మహిళా కొనసాగడం, నిబంధనలకు అనుగుణమా అని ప్రశ్నిస్తూ, నాయకత్వ అవకాశాలు కొత్త మహిళలకు కూడా అందాల్సిన అవసరాన్ని వివరించారు. రొటేషన్ విధానం అమలు చేస్తేనే గ్రామీణ మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, ప్రభుత్వ ఉద్దేశం కూడా అదే అని ఆయన అభిప్రాయపడ్డారు. కేవలం కొంతమంది రాజకీయ నాయకుల మెప్పు కోసం, ఏండ్ల తరబడి ఒకే సేవలు దేనికి సాంకేతమని వారు ప్రశ్నించారు. అంగన్వాడీ టీచర్ల నియామకాల విషయంలో పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం జరిగే విధంగా, ఎంపిక ప్రక్రియ ఉండాలని సర్పంచులు డిమాండ్ చేశారు. మహిళా సంఘాల ఏర్పాటు, వడ్డీ లేని రుణాల పంపిణీలో ఆలస్యం, సమాచార లోపంపై కూడా వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో పలువురు సర్పంచులు గ్రామాల అభివృద్ధి అనేది ప్రజా ప్రతినిధులకే పరిమితమైన బాధ్యత కాదని, అధికారులు కూడా క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలని సూచించారు. సమావేశాల్లో ఇచ్చే హామీలు కేవలం రికార్డులకే పరిమితం కాకుండా, అమలులోకి రావాలని వారు కోరారు. ప్రజా సమస్యలపై రాజీ పడకుండా అధికారులను ప్రశ్నిస్తూ, గ్రామ ప్రజల తరఫున తన వాదనను స్పష్టంగా వినిపించిన, యరుగండ్లపల్లి సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ ప్రశ్నలు సమావేశంలో ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. ప్రజా ప్రయోజనాల విషయంలో నిర్భయంగా మాట్లాడే నాయకత్వం అవసరమని, సమస్యలను దాచిపెట్టడం కంటే పరిష్కారం కోసం అధికార యంత్రాంగాన్ని జవాబుదారీగా నిలబెట్టడమే, ప్రజాప్రతినిధుల అసలు బాధ్యతనే సందేశాన్ని ఆయన ప్రస్తావించిన అంశాలు ప్రతిబింబించాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఇదే తరహాలో రాజపేట తండా సర్పంచ్ కొడాల వెంకట్ రెడ్డి, కుదాభక్షుల్లి సర్పంచ్ పందుల జయలక్ష్మి పాండు సైతం, తనదైన శైలిలో ప్రశ్నించారు. సర్పంచ్ లతో అధికారుల సమన్వయ లోపమే ఇందుకు కారణం అన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి వేణుగోపాల్, తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్, ఎంపీడీవో మునయ్య, ఎంపీఓ రవికుమార్, ఎంఈఓ శారదతో పాటు వివిధ శాఖల అధికారులు, మండలంలోని సర్పంచులు పాల్గొన్నారు.

# గిరిజనులకు రాజ్యాంగ హక్కులపై అవగాహన అవసరం

## అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 07: గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, సామాజిక న్యాయం, విద్య, ఆరోగ్యం, ఉపాధి, భూ, అటవీ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి. సౌజన్య సూచించారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎల్ఎస్ఏ సంగారెడ్డి ఆధ్వర్యంలో పటాన్‌చెరు మండలం ఇంద్రేశం, పెద్దకంజర్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు, మధ్యవర్తిత్వం, లోక్‌అదాలత్‌ల ద్వారా త్వరితగతిన న్యాయం అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, బాలల హక్కులు, పోక్సో చట్టం, గృహహింస నిరోధక చట్టం, సైబర్ నేరాలు, ర్యాగింగ్ నిరోధం, బాధితుల పరిహార పథకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గిరిజనుల సంప్రదాయాలు, సంస్కృతి, భాష, జీవన విధానాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకుని, తమ కుటుంబాలు, గ్రామ ప్రజలకు కూడా న్యాయ అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో




కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను కార్యదర్శి నివృత్తి చేశారు.



# విద్యే భవిష్యత్తుకు బాట.. లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలు: ఎమ్మెల్యే బీఎల్ఆర్



**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, ఆగస్టు 7:** మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్ విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేసి వారి విద్యాభ్యాసానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది విద్యేనని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణ, అంకితభావంతో చదువుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంతో పాటు ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ డి. ధర్మా నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హార్టికల్చర్, ఆయిల్‌పామ్, ఆరుతడి పంటల సాగుకు ప్రోత్సహించాలి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**





సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 07: వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా రైతులు హార్టికల్చర్, ఆయిల్‌పామ్, ఆరుతడి పంటల సాగు వైపు మళ్లేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వానాకాలం పంటల సాగు, నీటి లభ్యత, ఇతర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండాయని తెలిపారు. రైతులు ప్రధానంగా పత్తి, సోయాబీన్, కంది పంటలు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల వైవిధ్యీకరణ అవసరమని, ఆరుతడి పంటలు, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల స్థితి, విద్యుత్ సరఫరా వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు ప్రణాళికతో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# అక్రమాల కోసమే రైసుమిల్లులు





## ప్రభుత్వానికి 14 కోట్లు పైగా ఎగనామం

### అధికారుల అండతో ఎగనామం పెడుతున్న రైస్ మిల్లర్ ఓనర్లు

### పరారీలో రైస్ మిల్లర్ ఓనర్లు

### గాలింపు చేపట్టిన పెబ్బేరు పోలీసులు

**వనపర్తి ఆగస్టు 7 క్రైమ్ మిర్రర్:** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని రైస్ మిల్లర్ల చేతివాటం పతాకస్థాయికి చేరుకున్నది. సీఎంఆర్ కస్టమ్ మిల్లింగ్ రైస్ ధాన్యం విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించినప్పటికీ కొంతమంది మిల్లర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. రైస్‌మిల్లర్ల భారీ కుంభకోణం బట్టబయలైంది. ఈ కేసులో తీగలాగితే రూ.14 కోట్లకు పైగా స్కాం బయటపడింది. 14 కోట్ల మేర ప్రభుత్వానికి కట్టాల్సిన బకాయిలకు ఎగనామం పెట్టడంతో అధికారులు రైస్ మిల్లర్లపై కేసులు నమోదు చేశారు.. దీంతో పోలీసులు రైస్ మిల్లు చుట్టూ తిరుగుతూ మిల్లుల యజమానుల కోసం గాలింపు చేపట్టారు.. కేసు నమోదు విషయం తెలుసుకొని రైస్ మిల్లర్ల యజమానులు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి ఎవరికీ దొరకకుండా రైస్ మిల్లర్లు పరారీలో ఉన్నారు.. ఈ ఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో చోటుచేసుకుంది.. వివరాల్లోకి వెళితే పెబ్బేరు పట్టణ శివారులోని జాతీయ రహదారిపై ఉన్న సాయి గోపాల్ ఇండోటెక్ రైస్ మిల్లు లో 2022-23 సంవత్సరానికి సంబంధించి రబీ సీజన్ లో 4806 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ దాన్యం నిలువ చేసుకోగా దానికి సంబంధించిన రూ.14,82,76,644 లను ప్రభుత్వానికి



చెల్లించాల్సి ఉండగా నేటి వరకు మిల్లు యజమానులు చెల్లించలేదు. దీనిపై హైదరాబాద్ విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్, వనపర్తి జిల్లా సివిల్ సప్లై అధికారులు జూలై 27న రైస్ మిల్లులో సోదాలు జరపగా 780 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే చూపిస్తున్నారు. ఇంకా 4021 మెట్రిక్ టన్నుల ధాన్యం స్వాహా చేసినట్లు గుర్తించారు.. దీంతో సోదాలు జరిపిన ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్లు పూర్తి నివేదికతో వనపర్తి జిల్లా సివిల్ సప్లై మేనేజర్ కు నివేదిక అందజేశారు. వనపర్తి సివిల్ సప్లై డీఎం. ఆంజనేయులు గురువారం పెబ్బేరు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకునేందుకు రైసు మిల్లు వద్దకు, వారి ఇళ్ల వద్దకు వెళ్లి తనిఖీ చేశారు. కానీ ఈ విషయం ముందే తెలుసుకున్న మిల్లర్లు ఫోన్లు, స్విచ్ ఆఫ్ చేసి పరారీలో ఉన్నారు.

**అక్రమాల కోసమే మిల్లుల ఏర్పాటు**

పెబ్బేరు మండలంలోని మిల్లుల యాజమాన్యంతో కుమ్మక్కై జిల్లాకు చెందిన కొందరు బడా వ్యాపారులు అక్రమాల కోసమే కొత్తగా రైస్ మిల్లులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జూలై 27న నిర్వహించిన తనిఖీల్లో పెద్ద ఎత్తున ధాన్యాన్ని పక్కదారి పట్టించిన పెబ్బేరు మండలంలోని సాయి గోపాల్ ఇండోటెక్ రైస్ మిల్లులో సీఎంఆర్ ధాన్యం కేటాయింపులో గల లోసుగులపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్న సదరు యాజమాన్యం.. ధాన్యం డబ్బులను దండుకునేందుకే మిల్లులను ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. మిల్లులను ఏర్పాటు చేసి ఇంత పెద్ద ఎత్తున ధాన్యాన్ని తరలించడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. దాదాపు రెండు నుంచి మూడు కోట్లు పెట్టుబడి పెట్టి మిల్లులను ఏర్పాటు చేస్తున్న వ్యాపారులు.. సీఎంఆర్ ధాన్యాన్ని తీసుకుని బియ్యాన్ని ఇవ్వకుండా ప్రభుత్వానికి కోట్ల రూపాయలను ఎగవేస్తున్నారు. అధికారులు సదరు మిల్లులను సీజ్ చేసినా దాని యజమానులు పెద్దగా పట్టించుకోవడం లేదు. మిల్లు విలువ కంటే తరలించిన ధాన్యం విలువ పదింతలు ఉండడంతో ఈ అక్రమ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది. నాలుగేళ్లుగా జిల్లాలోని కొంతమంది మిల్లర్లు పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడుతున్నప్పటికీ వారిపై నామమాత్రపు చర్యలే తప్ప కఠిన చర్యలు లేకపోవడంతో అక్రమాలకు మరింత ఆస్కారమిస్తున్నదని చెబుతున్నారు. ఇటీవల సీఎంఆర్ విషయంలో అవకతవకలకు పాల్పడిన కొన్ని రైస్‌మిల్లులపై కేసులు నమోదు చేసినప్పటికీ పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదు. జిల్లాలో కొత్తగా రోజుకో రైస్‌మిల్ పుట్టుకొస్తూనే ఉన్నది. వాస్తవానికి ప్రతి సీజన్‌లో రైస్ మిల్లులకు సీఎంఆర్ ధాన్యం కేటాయించేటప్పుడు 10 శాతం బ్యాంకు గ్యారెంటీ తీసుకోవాలనే నిబంధన ఉన్నది. సంబంధిత అధికారులు అవేమి పట్టించుకోకుండా కొత్తగా ఏర్పాటు చేసిన మిల్లులకు ధాన్యాన్ని కేటాయించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది అధికారులు మిల్లర్లతో అంటకాగడం వల్లనే వారు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి



## ప్రజలకు మెరుగైన వైద్యం, విద్య, తాగునీరు అందించడమే లక్ష్యం

**అన్ని శాఖలు సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయాలి**

**రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహా**



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 07: జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలతో పాటు విద్య, తాగునీరు, వ్యవసాయం, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమ రంగాల్లో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేసి వాటి ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల వారీగా కార్యక్రమాల పురోగతి, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. జోగిపేట ఏరియా ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్ స్థానంలో నకిలీ వ్యక్తి వైద్యుడిగా విధులు నిర్వహించిన ఘటనపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రుల్లో వైద్యుల హాజరు, విధుల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని డీసీహెచ్‌ఎస్, ఆసుపత్రి సూపరింటెండెంట్లను ఆదేశించారు. కంకోల్, సింగితం పీహెచ్‌సీల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని, బర్దిపూర్, సుల్తాన్‌పూర్, నేరడిగుంట పీహెచ్‌సీ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. సంగారెడ్డి నర్సింగ్ కళాశాల, పటాన్‌చెరు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జహీరాబాద్ ఎంసీహెచ్‌లను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. విద్యా సంస్థలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. పాఠశాలలు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, డ్రైనేజీ, మరుగుదొడ్ల సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు. ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మంజీర, సింగూరు ప్రాజెక్టుల నీటి మట్టాలను సమీక్షించిన మంత్రి.. భవిష్యత్తులో తాగునీటి కొరత రాకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, సబ్‌కలెక్టర్ ఉమా హారతి, వివిధ శాఖల అధికారులు, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం

**గాజులరామారంలో 100 ఎకరాల్లో ఏర్పాటు**

**ట్రాఫిక్ ను తగ్గించేందుకు ప్రభుత్వ ప్రణాళిక**

**లోక్‌సభలో ధ్రువీకరించిన కేంద్రమంత్రి గడ్కరీ**

న్యూఢిల్లీ,ఆగస్ట్7: హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణం పూర్తయితే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో నిర్మాణం కోసం టీజీఎస్‌ఆర్టీసీ గతంలో హెచ్‌ఎంటీకి చెందిన స్థలాన్ని 99 ఏళ్ల పాటు లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే, కేవలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వగలమని, అదీ ఐదేళ్లకోసారి సమీక్షిస్తామని హెచ్‌ఎంటీ అధికారులు చెప్పారన్నారు. దీనికి అదనంగా ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని షరతు విధించడంతో ఈ ప్రతిపాదనను టీజీఎస్‌ఆర్టీసీ తిరస్కరించిందని గడ్కరీ వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో హెచ్‌ఎంటీ భూములకు సమీపంలోనే 100 ఎకరాల స్థలాన్ని టీజీఎస్‌ఆర్టీసీకి కేటాయించిందని గడ్కరీ స్పష్టం చేశారు. ప్రస్తుతం జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు నడుపుతున్నాయని, కొత్త డిపోతో ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత గాజులరామారం డిపోను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేకంగా ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్, సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్ ఏర్పాటు చేస్తారు.

## వడ్డేపల్లిలో రోడ్డుకు మరమ్మతులు

**ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పనులు చేపట్టిన గ్రామపంచాయతీ**

**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 07:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో దెబ్బతిన్న రోడ్డుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు. కొంతకాలంగా రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో సమస్యను గుర్తించిన పంచాయతీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలు, దెబ్బతిన్న ప్రాంతాలను సిమెంట్ మిశ్రమంతో పూడ్చి రహదారిని వినియోగానికి అనువుగా మార్చే పనులు చేపట్టారు. దీంతో రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా వర్షాల సమయంలో గుంతల్లో నీరు నిలిచి రోడ్డు మరింత దెబ్బతినకుండా ముందస్తు చర్యగా మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు.



**ప్రజల సమస్యలకు ప్రాధాన్యత**

మరమ్మతు పనులను వడ్డేపల్లి ఉపసర్పంచ్ విజయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి గణేష్ పర్యవేక్షించారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోని రహదారుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన ప్రాంతాల్లో మరమ్మతులు చేపడతామని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించడమే గ్రామపంచాయతీ లక్ష్యమని అన్నారు. రోడ్డు మరమ్మతులతో వాహనదారులు, స్థానిక ప్రజలకు కొంతమేర ఇబ్బందులు తగ్గనున్నాయని తెలిపారు. గ్రామపంచాయతీ చేపట్టిన తక్షణ మరమ్మతు చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ, మిగిలిన దెబ్బతిన్న రహదారులను కూడా గుర్తించి శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

## రూ.వేల కోట్ల జరిమానా

**మెటాకు అమెరికా కోర్టు భారీ షాక్..**

న్యూఢిల్లీ,ఆగస్ట్7: సోషల్ మీడియా దిగ్గజం మెటాకు అమెరికా కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిర్ధారించిన న్యూ మెక్సికో కోర్టు, కంపెనీకి 567 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 5,400 కోట్లకు పైగా) జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా రెండో దశలో జడ్జి బ్రయాన్ బీడ్‌షీడ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. తీర్పు ప్రకారం జరిమానా మొత్తంలో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన యువతకు చికిత్సా సేవల కోసం కేటాయించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిన నిధులను రాబోయే ఐదేళ్లలో అవగాహన, నివారణ కార్యక్రమాలు, స్క్రీనింగ్ సేవలు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించాలని ఆదేశించింది. ఈ కేసులో గత మార్చి నెలలో వెలువడిన తీర్పునకు ఇది కొనసాగింపు కావడం గమనార్హం. ఆ సమయంలో మెటా ఉద్దేశపూర్వకంగానే పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించిందని, లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టిందని నిర్ధారించిన జ్యూరీ, కంపెనీకి 375 మిలియన్ డాలర్ల సివిల్ పెనాల్టీ విధించింది. ఈ కేసు విచారణలో ప్రాసిక్యూటర్లు మెటా ప్లాట్‌ఫామ్‌లలో కీలక మార్పులు చేయాలని కోరారు. ముఖ్యంగా యువతను వ్యసనపరులుగా మార్చే ఫీచర్లను నియంత్రించాలని, వయసు నిర్ధారణ పద్ధతులను కఠినతరం చేయాలని, పిల్లల లైంగిక దోపిడీని అరికట్టేందుకు డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగులను మెరుగుపరచాలని వాదించారు. అయితే, ప్రాసిక్యూటర్ల అభ్యర్థనలను కోర్టు పాక్షికంగానే అంగీకరించింది. 13 ఏళ్లలోపు పిల్లలకు వయసు నిర్ధారణను తప్పనిసరి చేయాలన్న వాదనను తోసిపుచ్చింది. అమెరికాలోని 'చిల్డ్రన్స్ ఆన్‌లైన్ ప్రైవసీ ప్రొటెక్షన్ యాక్ట్' (సీఓపీపీఏ) ప్రకారం కేవలం వయసు నిర్ధారణ కోసం పిల్లల నుంచి వ్యక్తిగత సమాచారం సేకరించడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. అంతేగాక ఇతర సోషల్ మీడియా కంపెనీలకు లేని నిబంధనలను కేవలం మెటాపై మాత్రమే విధించడం సరికాదని, అది కంపెనీపై అనవసర భారం మోపుతుందని అభిప్రాయపడింది. ఈ తీర్పుపై మెటా ఇంకా స్పందించలేదు. ఇదిలా ఉంటే.. ఇటీవల మెటాకు చెందిన ఏఐ మోడల్ సైబర్ సెక్యూరిటీ పరీక్షల్లో భాగంగా బయటి సర్వీస్‌లోకి హ్యాక్ చేయడం, టెక్నాలజీపై నియంత్రణకు సంబంధించి కొత్త ఆందోళనలను రేకెత్తించింది.

## హిందూజా సోదరులకు ఊరట

**బోఫోర్స్ కేసును కొట్టేసిన సుప్రీం.. 40 ఏళ్ల బోఫోర్స్ కేసుకు పడిన తెర**

న్యూఢిల్లీ: దాదాపు నాలుగు దశాబ్దాలుగా దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా నిలిచిన బోఫోర్స్ కుంభకోణం కేసుకు తెరపడింది. దీని నుంచి హిందూజా సోదరులకు ఊరట కల్పిస్తూ ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన చివరి పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన న్యాయపరమైన ప్రక్రియ పూర్తిగా ముగిసింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ వినోద్ కె. చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. విచారణ వాయిదా వేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరినా, కోర్టు అంగీకరించలేదు. ఇప్పటికే చాలా కాలం గడిచిందని పేర్కొంటూ పిటిషన్‌ను తిరస్కరించింది. విచారణ సందర్భంగా "హిందూజా సోదరులు, సీబీఐ వ్యవహారం ఇంకా ఎందుకు కొనసాగుతోంది? అన్ని కేసులను హైకోర్టు కొట్టేసింది కదా. ఇంకా ఎంతకాలం ఈ వ్యవహారం కొనసాగుతుంది?" అని జస్టిస్ పార్దీవాలా వ్యాఖ్యానించారు. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది 1986లో ఈ ఒప్పందం జరిగిందని వివరించే ప్రయత్నం చేసినా, ధర్మాసనం మరిన్ని వాదనలు వినేందుకు నిరాకరించింది. 2005 మే 31న ఢిల్లీ హైకోర్టు హిందూజా సోదరులు శ్రీచంద్, గోపీచంద్, ప్రకాశ్ హిందూజాలతో పాటు స్వీడన్‌కు చెందిన ఏబీ బోఫోర్స్ కంపెనీపై ఉన్న క్రిమినల్ కేసులను కొట్టివేసింది. అప్పట్లో దర్యాప్తు తీరుపై కూడా సీబీఐని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఆ తీర్పును సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన అప్పీల్‌ను కూడా సుప్రీంకోర్టు 2018లో తిరస్కరించింది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.